RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 324 మేడ్చల్ మల్కాజ్‌గిరి 15 డిసెంబర్ 2024 ఆదివారం పేజీలు : 4

## ఛత్తీస్‌గఢ్‌లో అమిత్ షా పర్యటన

రాయ్‌పూర్ : కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా.. నేటి నుంచి అంటే మూడు రోజుల పాటు ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా శాంతి భద్రతలపై ఆయన సమీక్షిస్తారు. అలాగే లొంగిపోయిన మావోయిస్టులు, స్థానికులు, మావోయిస్టుల కారణంగా బాధితులుగా మారిన కుటుంబాలతో అమిత్ షా సమావేశం కానున్నారు. ఇక ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌కు అమిత్ షా చేరుకుంటారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని భద్రతపై ఉన్నతాధికారులతో ఆయన కీలక సమీక్ష నిర్వహించనున్నారు. అలాగే రాయ్‌పూర్ వేదికగా జరగనున్న కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ పోలీసులకు ప్రెసిడెంట్స్ కలర్ పురస్కారాన్ని అందజేయనున్నారు.




# సారొస్తారంట!

## 16న అసెంబ్లీకి వచ్చే ఛాన్స్ - కేసీఆర్ రాకపై పార్టీలో ఊహాగానాలు!!

హైదరాబాద్ : బీఆర్ఎస్ నేతలతో వరుసగా భేటీలు సమావేశాలు నిర్వహిస్తున్న గులాబీ బాస్ కేసీఆర్ ఈ దఫా సమావేశాలకు హాజరవుతారా? ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారా ? ఇప్పుడు ఇదే అధికార ప్రతిపక్ష పార్టీలో అత్యంత ఆసక్తిగా మారిన విషయం. ఎన్నికలు ముగిసి ఏడాది గడుస్తున్నా ఒకటి రెండు సార్లు మినహా కేసీఆర్ బయటకు రాలేదు. ఆ తర్వాత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా.... పద్దు ప్రవేశపెట్టిన తొలిరోజు సభకు వచ్చిన కేసీఆర్, మీడియా పాయింట్ దగ్గర, ప్రభుత్వతీరును ఎండగట్టి వెళ్లిపోయారు. ఆ తర్వాత ఎక్కడా బహిరంగ సభలు కానీ, ప్రెస్‌మీట్లు గాని నిర్వహించలేదు. అసెంబ్లీని కన్నెత్తి కూడా చూడలేదు.

దీంతో ఈసారైనా అసెం బ్లీకి వస్తారా అని సర్వత్రా ఆసక్తినెలకొంది. అయితే, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి ఏడాది సమయమివ్వాలని మొదట్నుంచీ చెబుతున్న కేసీఆర్ ఆ సమయం గడిచాకే బయటకు వస్తారని చెబుతున్నారు బీఆర్ఎస్ కీలక నేతలు. ప్రజల తరపున కచ్చితంగా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారని చెప్పుకొస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్న భారత రాష్ట్ర సమితికి.... కేసీఆర్ రాక మరింత జోష్ తీసుకొస్తుందనడంలో సందేహం లేదు. అయితే, ఆయన రాకపై, బీఆర్ఎస్ వర్గాల్లోనూ స్పష్టత కనిపించడం లేదు. అయితే, అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహిస్తారు ? ఏయే బిల్లులు సభలో ప్రవేశపెట్టనున్నారు ? అనే విషయాలపై పూర్తిషెడ్యూల్ తెలిసాక కేసీఆర్ నిర్ణయం తీసుకుంటారని పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరైనా, ఆయనకు తగిన ప్రాధాన్యత ఉంటుందా ? సభలో కేసీఆర్‌కు మైకు ఇవ్వకుండా ప్రభు త్వం అవమానిస్తే ఎలా ? అనే అంశాలపై కూడా గులాబీ పార్టీ చర్చించుకుంటోంది. ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి కేసీఆర్ ప్రభుత్వం మీద ఎలాంటి పోరాటం చేశారో రాష్ట్రం మొత్తం చూసింది. ఎన్ని అవమానాలు కేసులు భరించారో కూడా చూసింది. అన్ని బాధల నుంచి పట్టుబట్టి మరీ కాంగ్రెస్‌ను ఏకం చేసి విజయం సాధించాడు రేవంత్ రెడ్డి. ఇక ఇప్పుడు సీఎం పదవిలో ఆయనే ఉన్నారు. కాబట్టి ఖచ్చితంగా కేసీఆర్‌కు అసెంబ్లీలో అవమానం తప్పదనే భావనలో పార్టీ నేతలు భావిస్తున్నారు. ఏదేమైనా, అధినేత ఆగమనానికి సమయం ఆసన్నమైందన్నదని, వీలైనంత వరకు 16వ తేదీన తిరిగి ప్రారంభమవ్వనున్న అసెంబ్లీ శీతాకాల సమావేశాలకు హాజరవుతారనే ఊహాగానాలు బీఆర్ఎస్ శ్రేణుల నుండి వ్యక్తమవుతున్నాయి. మరి, గులాబీ బాస్ ఏం చేస్తారో చూడాలి.

# పెట్రోల్, డీజిల్ వినియోగదారులకు శుభవార్త..!




దేశ వ్యాప్తంగా ఉన్న పెట్రోల్, డీజిల్ వినియోగదారులకు శుభవార్త. పెట్రోలు, డీజిల్‌లను వస్తు సేవల పన్ను (GST) పరిధిలోకి తీసుకురావాలని యోచిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఇంధన ధరలను గణనీ యంగా తగ్గించే ఆలోచనలో ఉంది. ఈ చర్య మిలియన్ల మంది వాహనదారులకు ప్రయోజనం చేకూర్చనుంది. ఇంధన ధరలు లీటరుకు సగటున రూ.20 తగ్గుతాయని భావిస్తున్నారు. పెట్రోలు, డీజిల్‌లను GST పరిధిలోకి తీసుకురావడానికి, ఇంధన పన్నులను ప్రామాణికం చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ చర్చలు ప్రారం భించారు. ప్రస్తుతం ఇంధన పన్నులు రాష్ట్రాల వారీగా భిన్నంగా ఉన్నాయి. ఇది ధరల వ్యత్యాసాలకు దారి తీస్తుంది. ఏకరీతి జీఎస్టీ ప్రవేశపెట్టడం ద్వారా వినియో గదారులకు ఉపశమనం కలిగించాలని ప్రభుత్వం చూస్తోంది. పెట్రోలియం ఉత్పత్తులకు 28 శాతం జీఎస్టీ పన్ను విధించినట్లయితే వినియోగదారులు గణనీయమైన ధర తగ్గింపులను అనుభవిస్తారు:

**పెట్రోల్ : లీటరుకు రూ.19.71 తగ్గనుంది.**
**డీజిల్ : లీటరుకు రూ.12.83 తగ్గనుంది.**

ఒకే విధమైన పన్ను నిర్మాణం రాష్ట్రాలలో ధరల స్థిరత్వాన్ని నిర్ధారిస్తుంది. ఇంధన ధరలు తగ్గడం వల్ల రవాణా ఖర్చులు తగ్గుతాయి, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతాయి. ఈ చర్య సామాన్యులకు నిత్యావసర వస్తువులను అందుబాటులోకి తీసుకురావాలనే ప్రభుత్వ నిబద్ధతకు అనుగుణంగా ఉంటుంది. పెట్రోలు, డీజిల్‌లను జీఎస్‌టి పరిధిలోకి చేర్చడం ఆర్థిక సంస్కరణల దిశగా ఒక చారిత్రాత్మక అడుగును సూచిస్తుంది. ఇంధన పన్నుల ద్వారా ప్రభుత్వ ఆదాయాలు తగ్గుముఖం పట్టినప్పటికీ, పౌరుల సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. ఈ నిర్ణయం అమలైతే వినియోగదారులకు ఉపశమనం కలిగిస్తుంది.




## కొత్త ఏడాది నుంచే తాకట్టు లేకుండా 2 లక్షల రుణం

దిల్లీ: వ్యవసాయ అవసరాలకు, పంట సాగు కోసం ఎలాంటి తాకట్టు లేకుండా అందించే రుణ సదుపాయాన్ని పెంచుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (%=దీ×%) నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రైతులు ఎలాంటి తనఖా లేకుండా రూ.1.6 లక్షల వరకు రుణం తీసుకునే వెసులుబాటు ఉండగా.. ఇటీవల దాన్ని రూ.2 లక్షలకు పెంచింది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని తాజాగా స్పష్టంచేసింది. పంటల సాగుకు రైతులు పెడుతున్న ఖర్చులను, ద్రవ్యోల్బణం పెరుగుదలను పరిశీలిస్తూ ఆర్‌బీఐ ఈ పరిమితిని పెంచుతూ వస్తోంది. 2004లో కేవలం రూ.10 వేలే ఉంది. క్రమంగా దాన్ని పెంచుతూ వచ్చింది. తాజాగా దీన్ని రూ.2 లక్షలకు పెంచింది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం.. సాధారణంగా భూ యజమానుల నుంచి ఎలాంటి పూచీకత్తు అడగకుండా బ్యాంకులు రుణాలు మంజూరుచేయాలి. అయితే క్షేత్రస్థాయిలో ఇది అమలుకావడం లేదు. దీంతో ప్రైవేటు వ్యాపారుల నుంచి అధిక వడ్డీతో రుణం తీసుకొని అప్పులపాలవుతున్నారు. అలాంటివారికి అండగా ఉండేందుకు రిజర్వ్ బ్యాంక్ ఈ సదుపాయం కల్పిస్తోంది. వ్యవసాయ పెట్టుబడుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రైతులకు రుణ సదుపాయాన్ని మెరుగుపరచాల్సిన అవసరం ఉందని వ్యవసాయ మంత్రిత్వశాఖ తెలిపింది. ఈ చర్య ద్వారా చిన్న, సన్నకారు రైతులైన 86 శాతం మందికి ప్రయోజనం చేకూరనుందని పేర్కొంది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను వేగంగా అమలుచేయాలని, కొత్త రుణ నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించాలని బ్యాంకులకు సూచించింది. వ్యవసాయ రంగంలో రైతుల జీవనోపాధి మెరుగుపరిచేందుకు, వారికి అవసరమైన ఆర్థిక సౌలభ్యాన్ని అందించేందుకు ఇదొక వ్యూహాత్మక చర్యగా అభివర్ణించింది.




చిలుకూరు: గురుకులాలు అంటే బహుముఖ ప్రతిభకు కేంద్రాలు అనే గుర్తింపు తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా చిలుకూరులో గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో కామన్ డైట్‌ను ప్రారంభించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాలు, హాస్టళ్లలో ఒకే విధమైన మెనూ అమలు చేస్తున్నారు. పెంచిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త మెనూ రూపొందించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడారు.. గురుకులాల వ్యవస్థను పీవీ నరసింహారావు హయాంలో తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఇటీవలే డైట్ ఛార్జీలు పెంచారన్నారు. గురుకులాల బాట కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామని చెప్పారు. పాఠశాలల్లోని విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలు బాగున్నాయని చెప్పారు. "టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం, మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి ఒకప్పటి గురుకులాల విద్యార్థులే.

వీటిలో చదివి ఎందరో ఉన్నతస్థాయికి వెళ్లారు. ప్రైవేటు స్కూళ్లు వచ్చాక కొంత వరకు గురుకులాల ప్రభ తగ్గింది. వీటి ప్రక్షాళన కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. పదేళ్లుగా భారాస సర్కారు డైట్ ఛార్జీలు పెంచలేదు. మేం అధికారంలోకి వచ్చాక 40 శాతం పెంచాం. 16 ఏళ్లలో కాస్మోటిక్ ఛార్జీలు పెంచలేదు. 40 శాతం డైట్ ఛార్జీలు, 200 శాతం కాస్మోటిక్ ఛార్జీలు పెంచడం చరిత్ర. ఆర్థిక ఇబ్బందుల వల్ల పిల్లలను హాస్టళ్లలో చేరుస్తున్నారు. మనల్ని నమ్మి తల్లిదండ్రులు ఇక్కడికి పంపిస్తున్నారు. విద్యార్థుల మృతిపై మనం ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, సిబ్బందిపై ఉంది. ప్రతి నెల 10వ తేదీ లోపు గ్రీన్ ఛానల్ ద్వారా అన్ని విద్యాసంస్థలకు సంబంధించిన నిధులు వస్తాయి" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

**గురుకుల బాటలో మంత్రులు...** గురుకులాల బాటలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు గురుకులాలను సందర్శించారు. ఖమ్మం జిల్లా బోనకల్ పాఠశాలలో కామన్ డైట్ మెనూను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు. షేక్‌పేట గురుకుల పాఠశాలను మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించారు. తరగతి గదిలో డిజిటల్ బోర్డు పనితీరును పరిశీలించారు. సికింద్రాబాద్ మహేంద్రహిల్స్‌లో గురుకుల పాఠశాలను మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.


పాఠశాల, కళాశాలల్లో విద్యా బోధన, సమస్యలపై మంత్రి ఆరా తీశారు. భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లిలో గురుకుల పాఠశాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించారు. ఏకలవ్య పాఠశాల విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం మాదిరిపురంలో ప్రభుత్వ వసతి గృహాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సందర్శించారు.

# ఈనెల 16న లోక్‌సభ ముందుకు....

## వన్ నేషన్-వన్ ఎలక్షన్ బిల్లు

దిల్లీ: దేశంలో జమిలి ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లులకు గురువారం కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. కాగా ఈనెల 16న లోక్‌సభ ముందుకు వన్ నేషన్-వన్ ఎలక్షన్ బిల్లు రానున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ 129వ రాజ్యాంగ సవరణ బిల్లు కింద జమిలి ఎన్నికల బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేలా రాజ్యాంగ సవరణ బిల్లుకు ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంతో అధికార భాజపా 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' అనే కీలక ప్రణాళిక అమలుదిశగా ముందడుగు వేసింది. మూడు కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన చట్టాలను రాజ్యాంగ సవరణ బిల్లుతో అనుసంధానించేందుకు, చట్టాలను సవరించడానికి ఒక సాధారణ బిల్లుతో సహా రెండు ముసాయిదా చట్టాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన ఇటీవల సమావేశమైన కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన రెండు బిల్లుల్లో ఒకటి రాజ్యాంగ సవరణ బిల్లు కాగా.. మరొకటి సాధారణ బిల్లు. మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లోని (పుదుచ్చేరి, దిల్లీ, జమ్మూకశ్మీర్) అసెంబ్లీలకు సంబంధించిన చట్టాలను సవరించేందుకు సాధారణ బిల్లును తీసుకొస్తున్నారు. క్యాబినెట్ ఎజెండాలో ఈ బిల్లులు లేకపోయినా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాల పట్టుపట్టడంతో ఇవి ఆమోదం పొందాయని అధికారిక వర్గాలు వెల్లడించాయి. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతోపాటే స్థానిక ఎన్నికలనూ నిర్వహించాలని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వర్యంలోని కమిటీ సిఫార్సు చేసింది. ఇందుకోసం రెండు రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టాలని సూచించింది. అయితే స్థానిక ఎన్నికల విషయాన్ని ప్రస్తుతానికి పక్కనబెట్టిన కేంద్రం.. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలపై తీసుకొచ్చిన బిల్లులకు ఆమోదం తెలిపింది.

దీనికి 50శాతం రాష్ట్రాలు ఆమోదం తెలపాల్సిన అవసరం లేదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. స్థానిక ఎన్నికలనూ వాటితో కలిపి నిర్వహించాలంటే రాజ్యాంగ సవరణతోపాటు 50శాతం రాష్ట్రాలు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. అయితే రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల మద్దతు అవసరం. ఎన్డీయేకు అంత



బలం లేదు. దీంతో ఇండియా కూటమిలోని కొన్ని పార్టీల మద్దతు తీసుకోవాల్సి ఉంటుంది. ఇది ఎలా సాధ్యమనేది బిల్లు ప్రవేశపెట్టినప్పుడు తేలుతుంది. 542 మంది సభ్యులు ఉన్న లోక్‌సభలో ఎన్డీయేకు 293 మంది మద్దతుంది. ఇండియా కూటమికి 235 మంది సభ్యులున్నారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే 361 మంది సభ్యుల మద్దతు అవసరం. బిల్లులపై సమగ్ర చర్చ జరగాలని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. వాటిని పార్లమెంటులో ప్రవేశపెట్టాక పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపనున్నట్లు తెలుస్తోంది. ఈ కమిటీ ద్వారానే రాష్ట్రాల స్పీకర్లతో సంప్రదింపులు జరపాలని భావిస్తోంది.

# సంపాదకీయం

## మరో 'ప్రపంచ యుద్ధం' ఇరాన్ పై ట్రంప్ గురి?

ఇప్పటికే దాదాపు మూడేళ్లుగా సాగుతోంది ఉక్రెయిన్-రష్యా యుద్ధం.. దీంట్లోకి ఉత్తర కొరియా, యెమెన్ సైనికులు.. 14 నెలలుగా నడుస్తోంది హమాస్-ఇజ్రాయెల్ యుద్ధం.. దీనికితోడు సిరి యాలో ప్రభుత్వం మార్పు.. ఇజ్రాయెల్ పై ఇరాన్ దూకుడు.. తైవాన్ ప్రస్తావన తెచ్చినా చైనా సహించడం లేదు.. దాని చుట్టూ 30 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా విన్యాసాలు చేసింది.. తైవాన్ జోలికి వస్తే సహించేది లేదనేది దాని సిద్ధాంతం. ఇవీ ప్రస్తుతం ప్రపంచం ముందున్న సవాళ్లు.. ఇలాంటి సమయంలో మరో యుద్ధం వస్తే..? అది ప్రపంచ యుద్ధంగా మారే ప్రమాదం పొంచి ఉంటే..? యుద్ధం ఆపేస్తానని.. 'వారం రోజుల్లో ఇజ్రాయెల్-హమాస్ యుద్ధాన్ని ఆపేస్తా'.. 'ఉక్రెయిన్ పై రష్యా యుద్ధాన్ని ముగించేలా చేస్తా' ఇవీ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు. కానీ, ఆయన గెలిచాక మాత్రం మాట మారుస్తున్నారా? అని అనిపిస్తోంది. తనను గెలిపించిన 'శాంతి' ప్రవచనాలను తానే ఉల్లంఘిస్తున్నారు.

**ఇరాన్ అంటే రోగ్ కంట్రీ..** అమెరికాకు ఇరాన్ అంటే పడదు. దానిని రోగ్ (ధూర్త) దేశంగా అమెరికా అధ్యక్షులు నిందిస్తుంటారు. ఇక ఇరాన్ పూర్తిగా రష్యాకు మిత్ర దేశం. ఇప్పటికే ఇరాన్ పై అమెరికా ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలోనే ఇరాన్ తో భవిష్యత్తులో యుద్ధం జరిగే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు స్పందించిన 'ఏదైనా జరగొచ్చు' అంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు. టైమ్ మేగజీన్.. 'పర్సన్ ఆఫ్ ది ఇయర్' అవార్డుకు ఎంపిక అనంతరం ఆ మేగజీన్ కు ట్రంప్ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇరాన్ విషయంలో భవిష్యత్తులో ఏదైనా జరగొచ్చని.. పరిస్థితులు చాలా అస్థిరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇరాన్ మేజర్ జనరల్ ఖాసీం సులేమానీ హత్య 2020లో ట్రంప్ హయాంలోనే జరిగింది. ఆయన ఇచ్చిన ఆదేశాలతోనే అమెరికా దళాలు వైమానిక దాడులకు దిగి సులేమానీని హత్య చేశాయనే ఆరోపణ ఉంది. దీనికి ప్రతీకారం తీర్చుకునేందుకు ఇరాన్.. ట్రంప్ పై దాడులకు కుట్ర చేస్తున్నట్లు కథనాలు వస్తున్నాయి. ఎన్నికల సమయంలో హత్యాయత్నం వెనుక కూడా ఇరాన్ ఉందనే అనుమానాలు వచ్చాయి. దీంతో అమెరికా గట్టి హెచ్చరికలు చేసింది. ట్రంప్ నకు హాని తలపెట్టాలని చూస్తే.. దాన్ని యుద్ధాన్ని ప్రేరేపించే చర్యగా చూస్తామని స్పష్టం చేసింది.

**ఇరాన్ జోలికెళ్తే రష్యా సహిస్తుందా?...** ఇప్పటికే అమెరికా అంటే అగ్గి మీద గుగ్గిలం అవుతోంది రష్యా. ఇక చిరకాల మిత్ర దేశం ఇరాన్ జోలికివెళ్తే ఊరుకుంటుందా? అనేది చర్చనీయాంశం. బైడెన్ ప్రభుత్వం ఉక్రెయిన్ కు దీర్ఘ శ్రేణి క్షిపణులను ప్రయోగించే అనుమతివ్వడమే పెద్ద తప్పు అనుకుంటే.. ట్రంప్ వచ్చి ఇరాన్ మీద యుద్ధానికి దిగితే అది ప్రపంచంపై మరో 'ప్రపంచ యుద్ధం' అవుతుంది.

# స్త్రీనిధి వాయిదాలు.. పక్కదారి!



తాండూరు : స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేలా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ప్రోత్సహిస్తోంది. సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేస్తుండగా వ్యక్తిగతంగా స్త్రీనిధి రుణాలు అందిస్తోంది. తీసుకున్న రుణాల్ని తీర్చేందుకు కట్టిన కిస్తీల సొమ్మును కొందరు బ్యాంకులో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నారు. రెండు సంవత్సరాలు గడిచినా వసూలు చేయకుండా అధికారులు చోద్యం చూస్తున్నారు. వెరసి ఆయా మహిళలపై వడ్డీ భారం పడుతుండగా కొత్త రుణాలు పొందే వీల్లేకుండాపోతోంది. దీనికి సంబంధించి కథనం.

**1,085 సంఘాలు, 11,950 మందికి పైగా సభ్యులు**

తాండూరు మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో 1,085 స్వయం సహాయక సంఘాలు కొనసాగుతున్నాయి. వీటిలో 11,950కిపైగా మహిళలు సభ్యులుగా నమోదయ్యారు. వీరందరికీ ఏటా రూ.2కోట్లకుపైగా స్త్రీనిధి రుణాలు అందిస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.25వేల నుంచి రూ.2లక్షల వరకు నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారు. రుణాన్ని తిరిగి నెలనెలా సులభ వాయిదాల్లో చెల్లిస్తున్నారు. ఈక్రమంలో ఐనెల్లిలో మహిళలు పొందిన స్త్రీనిధి రుణ వాయిదాలను సీసీకి, మహిళా సంఘాల అధ్యక్షురాలికి అందజేశారు. ఆ సొమ్మును మహిళల రుణ ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా సొంతానికి వాడుకున్నారు. కొన్నినెలలుగా బకాయిలను గుర్తించిన ఉన్నతాధికారులు గ్రామానికి వచ్చి విచారిస్తే మహిళలు చెల్లించిన రుణ కిస్తీల సొమ్ము రూ.22లక్షలను సీసీ, అధ్యక్షురాలు బ్యాంకులో జమ చేయకుండా దుర్వినియోగం చేసినట్లు తేల్చారు.

**రూ.22 లక్షలకు పైగా సొంతానికి వినియోగం**

స్త్రీనిధి వాయిదాల సొమ్ము సొంతానికి వాడుకున్నట్లు గుర్తించిన అధికారులు బాధ్యుల నుంచి వసూలు చేసేందుకు అలసత్వం వహిస్తుండటంపై విమర్శలొస్తున్నాయి. ఇద్దరూ కలిసి చెరి రూ.11లక్షలు ఇచ్చేందుకు గతంలో అంగీకరించారు. వెంటనే ఒకరు నగదు చెల్లించేందుకు ముందుకొచ్చారు. ఇద్దరూ చెల్లిస్తేనే తీసుకుంటామని అధికారులు అప్పట్లో పేచీ పెట్టారు. ఇప్పటివరకు పైసా వసూలు చేయకుండా మిన్నకుండిపోయారు. లోపాలు జరిగి రెండు సంవత్సరాలు గడిచినా మహిళల సొమ్ము వసూలు చేయకుండా నిర్లక్ష్యం వహించడంపై గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రుణాలు పొందిన మహిళలు నెలనెలా సక్రమంగా వాయిదాలు కట్టినప్పటికీ బ్యాంకు ఖాతాల్లో బకాయిల కారణంగా కొత్త రుణాలు పొందే వీల్లేకుండాపోతోంది. అధికారుల నిర్లక్ష్యం మహిళలపాలిట శాపంలా మారింది. ఈ ఉదంతంపై ఉన్నతాధికారులు దృష్టిసారించి వెంటనే మహిళలు చెల్లించిన వాయిదాల సొమ్ము వసూలు చేసి బ్యాంకులో జమచేయాలని కోరుతున్నారు.

**వసూలు చేస్తాం - ఆనంద్, ఏపీఎమ్, తాండూరు**

ఐనెల్లిలో డ్వాక్రా మహిళలు స్త్రీనిధి రుణాలకు సంబంధించి నెలనెలా కిస్తీలు కడితే సీసీ, అధ్యక్షురాలు వాడుకున్నట్లు గుర్తించాం. వారు చెరిసగం చెల్లించేందుకు అంగీకరించారు. నెలాఖరు వరకు రూ.50వేలు కడతామన్నారు.

# 'బడి శిథిలం'.. జర పైలం



హైదరాబాద్ : హయత్‌నగర్ జడ్పీ ఉన్నతపాఠశాల ఆవరణలోని గేటు మీద పడి ఏడేళ్ల చిన్నారి అజయ్ సోమవారం మృతిచెందాడు. గేటు బాగుచేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు చెప్పినా పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో గ్రేటర్ పరిధిలోని 2,544 ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు పరిశీలించగా.. 30శాతం పాఠశాలల్లో మాత్రమే మౌలిక సదుపాయాలు బాగుండగా.. 70శాతం బడుల్లో అరకొర సౌకర్యాలున్నాయి. కొన్ని బడులు శిథిలావస్థకు చేరుకోగా.. మరికొన్నింట పైకప్పులు పెచ్చులూడుతున్నాయి. గోడల్లోంచి ఇటుకలు, రాళ్లు కనిపిస్తున్నాయి. ఇంకొన్ని పాఠశాల్లో శౌచాలయాలు సక్రమంగా లేవు. విద్యుత్తు తీగలు పక్కనుంచే వెళ్తున్నాయి. వెరసి సర్కారు బడుల విద్యార్థులు ప్రమాదాలతో సహవాసం చేస్తున్నారు. పదేళ్లుగా పాఠశాలల అభివృద్ధికి నిధులు వెచ్చిస్తున్నామని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో కనిపించడంలేదు. మన ఊరు-మన బడి, మన బస్తీ..మనబడి, అమ్మ ఆదర్శ పాఠశాలల పేర్లతో చేపట్టిన అభివృద్ధి పనులు కొన్నిచోట్లకే పరిమితమయ్యాయి.

తార్నాకలోని విజయ డెయిరీ క్వార్టర్స్‌లోని పాఠశాల స్వరూపమిది. ఈ ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం 90మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. శిథిలావస్థకు చేరిన ఈ భవనాలను ఖాళీ చేయాలని డెయిరీ యాజమాన్యం మూడేళ్ల క్రితమే హెచ్చరించినా.. ప్రభుత్వం మేలుకోలేదు. వేరేచోటికి తరలించలేదు. కొత్త పాఠశాల ఏర్పాటుకు స్థలమూ ఇవ్వలేదు. ఎండాకాలంలో పెచ్చులూడటం, వర్షాకాలంలో గదులపైనుంచి నీరు కారడం సాధారణంగా మారింది. వైరింగ్‌లు పాడవడంతో విద్యుదాఘాతం ప్రమాదం పొంచిఉంది. ఇక్కడి ఉపాధ్యాయులు ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా స్పందన లేదు. పాతబస్తీలోని తాడ్‌బన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల(ఉర్దూ మాధ్యమం) ఇది. అద్దె భవనంలో కొన్నేళ్లుగా కొనసాగుతోంది. ప్రభుత్వం అద్దె సక్రమంగా చెల్లించకపోవడంతో భవన యజమాని నిర్వహణను పట్టించుకోవడంలేదు. దీంతో గేటు భూమిలోకి కూరుకుపోయింది. తరగతి గదుల్లోకి గాలి, వెలుతురు రావడంలేదు. వందమందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. వానొస్తే నీరంతా ప్రాంగణంలో నిలిచిపోతోంది. గోడలు పాతబడిపోయాయి. మరోచోటి కి మార్చాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజాప్రతినిధులను కొన్నేళ్లుగా అభ్యర్థిస్తున్నా పట్టించుకోవడం లేదు. తాగునీరు, శౌచాలయం ప్రాంగణంలోనే ఉండటంతో ప్రాంతమంతా అపరిశుభ్రంగా ఉంది.

**ప్రాధాన్య క్రమంలో పనులు**

హయత్‌నగర్ పాఠశాలలో ప్రమాదం దృష్ట్యా జిల్లాలోని అన్ని ప్రభుత్వ బడుల్లో ఎక్కడా ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నాం. తాత్కాలిక, శాశ్వతంగా చేపట్టాల్సినపనులపై ఉపాధ్యాయుల నుంచి ప్రతిపాదనలు తీసుకున్నాం. ఒకటిరెండు రోజుల్లో పనులు మొదలుపెడుతున్నాం. విద్యా సంవత్సరం ప్రారంభంనుంచే పాఠశాలల్లో సౌకర్యాలపై దృష్టిసారించాం. ప్రాధాన్య క్రమంలో వీటిని పూర్తిచేసేందుకు కార్యాచరణ రూపొందించాం.
సుశీందర్‌రావు, డీఈవో, రంగారెడ్డి

**చెట్లు, గేట్లు, గోడల వద్ద జాగ్రత్తలు**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లోని చెట్లు, గోడలు, గేట్ల సమీపంలో విద్యార్థులుండకుండా గమనించాలంటూ ఉపాధ్యాయులను ఆదేశించాం. బడుల స్థితిగతుల వివరాలు సేకరించి మరమ్మతులుంటే వేగంగా చేయించనున్నాం. విజయకుమారి, డీఈవో, మేడ్చల్

**ప్రత్యేక బాధ్యతలు అప్పగించాం**

పాఠశాలల్లో ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాం. ప్రధానోపాధ్యాయులతో చర్చించి కొందరు ఉపాధ్యాయులు, పీఈటీలకు ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగించాం. రోడ్లపై విద్యార్థులను దాటించేందుకు ట్రాఫిక్ పోలీసుల సహకారం తీసుకుంటున్నాం. ఆర్.రోహిణి, డీఈవో, హైదరాబాద్

# కేంద్రానికి చేరిన మెట్రో డీపీఆర్‌లు

హైదరాబాద్: మెట్రోరైలు రెండోదశ మొదటి భాగం (పార్ట్-ఏ) సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలు సోమవారం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. ఐదు కారిడార్లలో 76.4 కి.మీ.గానూ రూ.24,269 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. డీపీఆర్‌లతో పాటూ హెచ్ఎండీఏ పరిధి వరకు సిద్ధం చేసిన కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్(సీఎంపీ) ట్రాఫిక్ అధ్యయన నివేదిక, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పరిపాలన అనుమతులు జత చేసి పంపారు.

**సంయుక్త ప్రాజెక్ట్‌గా..** మెట్రోరైలు రెండోదశ ప్రాజెక్ట్‌ను కేంద్ర, రాష్ట్ర సంయుక్త భాగస్వామ్యంతో చేపట్టాలని జులైలో సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీ వెళ్లి సంబంధిత మంత్రికి విజ్ఞప్తి చేశారు. త్వరలో డీపీఆర్‌లను సమర్పిస్తామని చెప్పారు. అందుకనుగుణంగా జులై 26న మంత్రి మండలిలో ఆమోదం, నవంబరు 2న పరిపాలన పరమైన అనుమతులు జారీ చేసి నవంబరు 4న కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి పంపారు. **నిధుల సేకరణ..** వ్యయంలో రూ.7,313 కోట్లు (30 శాతం) రాష్ట్రం భరించనుంది. రూ.4,230 కోట్లు (18 శాతం) కేంద్రం భరించాలని రాష్ట్రం కోరుతోంది. 48 శాతం రూ.11,693 కోట్లను రుణంగా, 4 శాతం పీపీపీ ద్వారా సమకూర్చుకోనున్నారు. హైదరాబాద్ మెట్రో పాలిటన్ ఏరియా పరిధిలో నిర్వహించిన కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ) కేంద్రం పరిశీలించి నిర్ణయం తీసుకుంటుంది. ఈప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేందుకు.. సీఎం




త్వరలోనే దిల్లీ వెళ్లి కేంద్రం పెద్దలకు పరిస్థితిని వివరించనున్నారు. **తక్కువ వడ్డీకి రుణాలు..** 'మెట్రో రెండోదశపై సీఎం రేవంత్‌రెడ్డి చాలా శ్రద్ధ కనబరుస్తున్నారు. సీఎం సూచన మేరకు డీపీఆర్, సీపీఎం ప్లాన్‌లను కేంద్రానికి పంపించాం. కేంద్ర ప్రభుత్వ సావరిన్ గ్యారంటీతో రెండుశాతం కంటే తక్కువ వడ్డీరేట్లకు రుణం పొందడం ద్వారా ప్రాజెక్ట్‌ను తక్కువ వ్యయంలో పూర్తిచేసేందుకు అవకాశం ఉంటుంది' అని ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు.

# గణనకు సిద్ధం.. నమోదే కీలకం

పెద్దపల్లి : జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన(సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)కు సర్వం సిద్ధమైంది. ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించనున్నారు. ఇప్పటికే బ్లాక్‌లుగా విభజించి ఎన్యుమరేటర్లకు ఇళ్లు కేటాయించారు. మూడు రోజుల పాటు ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. మొత్తం 75 ప్రశ్నలతో కూడిన ఎనిమిది పేజీల పత్రాన్ని ఇంటి యజమానులు ఇచ్చిన సమాచారం ఆధారంగా పూరించనున్నారు. ఎప్పటికప్పుడు సర్వే వివరాలను డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఉపాధ్యాయులు(ఎస్జీటీలు), అంగన్‌వాడీ ఉపాధ్యాయినులు, ఏఎన్ఎంలు, ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు, వీవోఏలు(గ్రామైక్య సంఘాల సహాయకులు), ఆశా కార్యకర్తలు సర్వేలో భాగస్వాములవుతున్నారు. కుటుంబాల వారీగా ఆస్తులు, ఆదాయం, అప్పులు, రాజకీయ పదవులు, అయిదేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధి.. తదితర 75 రకాల ప్రశ్నలతో సమాచారం సేకరించనున్నారు. ఎన్యుమరేటర్ వచ్చినపుడు ఆ ఇంట్లో ఒకటి కంటే ఎక్కువ కుటుంబాలుంటే మరో ఇంటి నంబరు కేటాయించి సమాచారం వేర్వేరుగా సేకరిస్తారు. జిల్లాలో కుటుంబాల సంఖ్యను 2.50 లక్షలుగా అంచనా వేశారు. వీటి సంఖ్య పెరగనుంది. 1,900 మంది ఎన్యుమరేటర్లు వివరాలు సేకరిస్తారు.

**పది రోజుల్లో పూర్తయ్యేనా!**

ప్రాథమిక పాఠశాలల్లోని ఎస్జీటీలకు సర్వే విధులు కేటాయించడంతో బడులకు మధ్యాహ్నం పూట సెలవు ప్రకటించారు. జిల్లావ్యాప్తంగా 400 మంది ఎస్జీటీలు ఇందులో పాల్గొంటున్నారు. ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉన్న పాఠశాలల్లోని వారినే ఎన్యుమరేటరు బాధ్యతలు అప్పగించినట్లు అధికారులు చెబుతున్నా పరిస్థితి భిన్నంగా ఉంది. సర్వే విధులతో బోధనపై ప్రభావం ఉంటుందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాల



నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 15లోగా సర్వే పూర్తి చేయాలని భావిస్తున్నారు.

**రోజువారీగా వివరాలు నిక్షిప్తం**

గ్రామాలు, పట్టణాల్లో సేకరించిన సమాచారాన్ని రోజువారీగా మండల పరిషత్, మున్సిపాలిటీల్లో డాటా ఎంట్రీ ఆపరేటర్లు కంప్యూటర్లలో నిక్షిప్తం చేయనున్నారు. ఈ మేరకు 14 మండల పరిషత్ కార్యాలయాలు, రామగుండం నగరపాలిక, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పురపాలికల్లో ఏర్పాట్లు చేశారు.

జనాభా ఆధారంగా ఒక్కో మండలానికి 6-10 మంది ఆపరేటర్లను నియమించారు. ఆన్‌లైన్‌లో వివరాల నమోదుపై వీరికి శిక్షణ ఇచ్చారు. కొన్ని చోట్ల ప్రైవేటు ఆపరేటర్లను తీసుకుంటున్నారు.

ప్రభుత్వం గతంలో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల నమోదులో తప్పిదాలు చోటుచేసుకున్నాయి. చాలా మందికి గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు ఉచిత కరెంటు, రూ.500కే వంటగ్యాస్ పథకాలు వర్తించడం లేదు. తప్పుల సవరణకు వారు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. మండల, జిల్లా స్థాయిలో నోడల్ అధికారులు పటిష్ఠంగా పర్యవేక్షిస్తేనే వివరాల నమోదులో పొరపాట్లను నివారించవచ్చు. **పక్కాగా నమోదు-రవీందర్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి**

జిల్లాలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే కోసం ఎన్యుమరేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చాం. తొంభై శాతం ఇళ్లకు స్టిక్కర్లు అంటించాం. మిగిలిన ఇళ్లకు పూర్తి చేస్తాం. పక్కాగా వివరాలు నమోదు చేయాలని సూచించాం. లేకుండా సర్వే చేసేందుకు ఏర్పాట్లు చేశాం.

# నష్టం లేకుండా.. కష్టాలపాలు కాకుండా..!

కొత్తగూడెం : గతేడాది డిసెంబర్ మొదటి వారంలో మిగ్‌జాం తుపాను కారణంగా సంభవించిన అకాల వర్షాలు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని రైతులకు తీరని విషాదాన్ని నింపాయి. వరి, మిరప, మొక్కజొన్న, పత్తి, ఇతర ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పంట బీమా పాలసీలు లేక, ప్రభుత్వ పరిహారం అందక అన్నదాతలు నష్టాలను మూటగట్టుకున్నారు.

బంగాళాఖాతంలో ఏటా నవంబర్, డిసెంబర్ మాసాల్లో సంభవిస్తున్న తుపాన్ల ముప్పు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలపై అధికంగా ఉంటోంది. రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాలు తిరోగమించి, ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించే సమయంలో సముద్ర ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుంటాయి. ఇవి బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడటానికి అనుకూలిస్తాయి. అవి క్రమేణా వాయుగుండాలు, తుపాన్లుగా మారి తీవ్ర నష్టాలకు కారణమవుతున్నాయి. నవంబర్, డిసెంబర్ మాసాల్లో గత పదేళ్లలో పదకొండు తుపాన్లు ఏర్పడ్డాయి. గతేడాది సంభవించిన 'మిగ్‌జాం'తో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని రైతులు తీవ్రంగా నష్టపోయారు.

**నిండుకుండలా జలాశయాలు**ఆగస్ట్, సెప్టెంబర్ మాసాల్లో కురిసిన భారీ వర్షాలతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో రిజర్వాయర్లు, చెరువులు నిండుకుండలా తయారయ్యాయి. వాయుగుండం, తుపాన్ల ప్రభావంతో కొన్నిచోట్ల రోజుకు కనీసం 15 నుంచి 20 సెం.మీ వర్షం కురిసే అవకాశం ఉంటుంది. ఇలాంటి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే అప్రమత్తం కావాలని వాతావరణశాఖ అధికారులు సూచిస్తున్నారు. బలహీనంగా ఉన్న చెరువు, కాల్వ కట్టలను పటిష్ఠపరుచుకోవాలంటున్నారు. మరికొన్ని రోజుల్లో వరితో పాటు ఇతర పంటలు చేతికి రానున్న నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

నవంబర్- జనవరి మధ్య కాలంలో సంభవించే అకాల వర్షాల వల్ల నష్టపోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసరావు సూచిస్తున్నారు.

మిరప, పత్తి, మొక్కజొన్న, వరి పంటలు కోతకొచ్చిన సమయంలో అధిక వర్ష సూచనలుంటే పంట కోతలను చేపట్టకపోవటం మేలు. మిరప, మొక్కజొన్న, ఇతర పంటల్లో వర్షం నీరు నిలవకుండా చూసుకోవాలి. ఎప్పటికప్పుడు మురుగు కాల్వల ద్వారా వర్షం నీటిని బయటకు పంపించాలి.

ఈదురుగాలుల ధాటికి కిందపడిన వరి దుబ్బులను నీటి నుంచి తీసి నిలబెట్టి కట్టలు కట్టాలి. పంట కిందపడిపోయినప్పుడు ధాన్యం మొలకెత్తకుండా పైరుపై ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలి. తుపాను తర్వాత అధికంగా ఆశించే అగ్గి తెగులు, సుడిదోమలకు నివారణ చర్యలు ముందుగానే చేపట్టాలి. వర్షాల సమయంలో కొత్త పంటలను విత్తుకోకూడదు. ఎందుకంటే అధిక తేమతో విత్తనాలు కుళ్లి మురిగిపోతాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఉంటే వర్షాలకు తడవకుండా పట్టాలను కప్పి ఉంచాలి. తుపాను తగ్గిపోయిన తర్వాత ఎండబెట్టుకోవాలి.

## సరైన ఆహారంతో..
## చలికాలంలో వ్యాధులకు చెక్!

హైదరాబాద్ : చలి పెరుగుతోంది. పిల్లల నుంచి పెద్దల వరకు జలుబు, దగ్గు, వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. పెద్ద ఆసుపత్రులకు వచ్చే వారిలో చాలామంది వైరల్ ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. చంటి పిల్లలు న్యుమోనియా, ఇతర శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు ఎదుర్కొంటున్నారు. నిలోఫర్‌కు వచ్చే పిల్లల్లో 0-5 ఏళ్లలోపు వారే ఎక్కువ ఉంటున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. చలికాలంలో సరైన ఆహారంతో వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చని సూచిస్తున్నారు.మూడు పూటలా ఆహారం ఇలా..
అల్పాహారంలో దోశ, ఇడ్లీతోపాటు చిరుధాన్యాలు మేలు చేస్తాయి. జొన్న రవ్వ, సజ్జలు, గోధుమ రవ్వతో చేసే ఉప్మా, రాగి ఇడ్లీ, మల్టీ గ్రెయిన్ పిండితో చేసిన రొట్టెలు, మొల కలు, ఉడకబెట్టిన గుడ్డు మంచివి.
అల్పాహారం తర్వాత మధ్యాహ్న భోజనానికి బత్తాయి, కమలాలు, నారింజ, దానిమ్మ పండ్లు తీసుకోవచ్చు.
రోజూ గుప్పెడు అన్ని రకాల డ్రైఫ్రూట్స్ తీసుకోవాలి.
సాయంత్రం ఉడకబెట్టిన సెనగలు, బొబ్బర్లు, స్వీట్ కార్న్, డ్రైఫ్రూట్స్‌తో చేసిన చిక్కీ లడ్డు, నువ్వులు, వేరుసెనగ లడ్డూ తీసుకోవచ్చు. గ్రీన్‌టీ, జింజర్ టీ, సూప్‌లతో ఉపశమనం లభిస్తుంది.
రాత్రి భోజనం తొందరగా పూర్తి చేయాలి. డిన్నర్‌లో జొన్న రొట్టె, గోధుమ రొట్టెలు తీసుకోవచ్చు. వీటితోపాటు వెజిటబుల్ కర్రీ, ఆకుకూర పప్పు లాంటి తేలిక పాటి ఆహారం మేలు చేస్తాయి. రాత్రి ఆహారం ఎంత తేలిగ్గా ఉంటే.. నిద్రకు ఆటంకం లేకుండా మరుసటి రోజు హుషారుగా మొదలవుతుంది.
చంటి పిల్లలకు 6నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలి. 6 నెలలు దాటిన పిల్లలకు తల్లిపాలతోపాటు ఇంట్లో తయారు చేసిన ఆహారం అందించడం వల్ల రోగాల బారిన పడకుండా ఉంటారు

## ధరణి దరఖాస్తులకు మోక్షం

పెద్దపల్లి : భూ వివరాలకు సంబంధించిన సాంకేతిక తప్పిదాలతో కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్న రైతులకు ఎట్టకేలకు ఊరట లభించింది. ధరణిలో పెండింగ్ దరఖాస్తులకు మోక్షం కలగనుంది. సమస్యల పరిష్కారంలో వేగం పెంచేందుకు ప్రభుత్వం కలెక్టర్ ఆధీనంలో ఉన్న పలు అధికారాలను బదలాయించింది. తహసీల్దార్లు, ఆర్డీవో, అదనపు కలెక్టర్లకు పరిష్కార బాధ్యతలు కట్టబెట్టింది. ఇప్పటివరకు ప్రతి సమస్యకూ సంబంధించి కలెక్టర్ సంతకం అవసరం కావడంతో పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. దీంతో దరఖాస్తుదారులు నెలల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

**పెండింగ్‌లో 563 దరఖాస్తులు**

వ్యవసాయ భూములకు ఏక కాలంలో పట్టా హక్కులు కల్పించేందుకు 2020 నవంబరు 2న అప్పటి ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. అప్పటి నుంచి భూములకు సంబంధించి అన్ని రకాల అధికారాలు కలెక్టర్ చేతిలోనే ఉంటున్నాయి. చిన్న చిన్న సవరణల కోసం కూడా కలెక్టర్ లాగిన్ కావాల్సి ఉండటంతో పరిష్కారంలో జాప్యం నెలకొంది. మరోవైపు రైతుల నుంచి భూ సమస్యలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఎట్టకేలకు ప్రభుత్వం అధికారాలు బదలాయించడంతో త్వరితగతిన సమస్యలు పరిష్కారమవుతున్నాయి. జిల్లాలో ఇప్పటివరకు 563 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

**అదనపు కలెక్టర్‌కు అయిదు.. ఆర్డీవోకు మూడు**

అదనపు కలెక్టర్‌కు అయిదు రకాల అధికారాలను బదలాయించారు. యాజమాన్య హక్కు బదిలీ(టీఎం-3 మ్యుటేషన్), కోర్టు కేసులతో ముడిపడి, పాసుపుస్తకాల కోసం వచ్చే దరఖాస్తులు(టీఎం-24), పట్టాదారు పాసుపుస్తకం లేదా వ్యవసాయేతర భూమిగా మార్చడానికి ఆటంకంగా ఉన్న రికార్డుల్లో గృహం, హౌస్‌సైట్ అని నమోదైన వాటికి సంబంధించిన దరఖాస్తులు(టీఎం-31), పాసుపుస్తకంలో తప్పుల సవరణ(టీఎం-33), పేరు మార్పు కోసం వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అవకాశం కల్పించారు.
ఆర్డీవో స్థాయిలో మూడు రకాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. వారసత్వ బదిలీలకు సంబంధించి, అసైన్డ్ భూములకు పాసుపుస్తకాలు లేని దరఖాస్తులు (టీఎం-4), వ్యవసాయేతర భూముల మార్పిడికి సంబంధించినవి (టీఎం-27), సర్వే నంబర్లు, డిజిటల్ సంతకాల దరఖాస్తుల (టీఎం-33)ను తహసీల్దార్ల విచారణతో ఆర్డీవో పరిష్కరించనున్నారు.

**సాగులో ఉన్నా పట్టా హక్కులు లేవు**

కొన్నేళ్ల కిందట మా తండ్రి 28 గుంటల భూమిని కొనుగోలు చేశారు. అప్పటి నుంచి మేమే సాగు చేసుకుంటున్నాం. పట్టా కోసం సాదాబైనామాలో దరఖాస్తు చేసుకున్నా. రికార్డులో హౌస్ సైట్ అని తప్పుగా నమోదైంది. పట్టా హక్కులు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు వర్తించడం లేదు. లింగయ్య, కన్నాల, మంథని మం.

**సవరణకు రెండేళ్లుగా తిరుగుతున్నా**

గ్రామ శివారులో మాకున్న భూమిలో ఆరు గుంటలు ఎస్సారెస్పీ అవసరాల కోసం సేకరించినట్టు రికార్డుల్లో ఉంది. వాస్తవానికి మా భూమిని సేకరించలేదు. అధికారులు చేసిన తప్పిదాలతో భూమిపై పట్టా హక్కులు కోల్పోవాల్సి వస్తోంది. సవరణకు దరఖాస్తు చేసి రెండేళ్లుగా తిరుగుతున్నా పరిష్కరించడం లేదు. పర్ల సమ్మయ్య, పెద్దకల్వల, పెద్దపల్లి మం. **పరిష్కారంలో వేగం పెరగనుంది**
భూ సమస్యల పరిష్కారంలో వేగం పెరగనుంది. క్షేత్ర స్థాయి పరిశీలన నివేదిక ఆధారంగా అర్జీలు త్వరితగతిన పూర్తి కానున్నాయి. సమస్యలు పెండింగ్‌లో లేకుండా సులభంగా పరిష్కారమవుతాయి. దాసరి వేణు, అదనపు కలెక్టర్

## కాలువలు ఇలా.. నీరు పారేదెలా?

రాయికల్ : డిసెంబర్ చివరి వారంలో శ్రీరాంసాగర్ జలాల విడుదలకు ఎస్సారెస్పీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రాయికల్ మండలంలో 90 శాతం గ్రామాలు ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలో ఉండగా సుమారు 70 శాతం మంది రైతులు కాలువల కింద పంటలు సాగు చేస్తున్నారు. నీటిని సరఫరా చేసే ప్రధాన, పిల్ల కాలువలు పిచ్చి మొక్కలతో నిండటంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. మొదటి గ్రామాలకు సాగునీరు అందినా చివరి గ్రామాలకు నీరు రాని పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల కాలువల్లో పూడికను తొలగించినా సిమెంట్ లైనింగ్ పై భాగాన పిచ్చి మొక్కలు, చెట్లను తొలగించలేదు. అధికారులు కేవలం నీరు వదిలినప్పుడే పర్యవేక్షించి పట్టించుకోకపోవడంతో కాల్వల పరిస్థితి అధ్వానంగా ఉంది. రైతు భాగస్వామ్యంతో ఏర్పాటు చేసే నీటి సంఘాల సభ్యులు గతంలో కాల్వల మరమ్మతు, పూడికతీత, పిచ్చి మొక్కల తొలగింపు తదితర పనుల పర్యవేక్షణతో పాటు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేవారు. ఏళ్లుగా నీటి సంఘాలు ఏర్పాటు లేక పోవడంతో సమస్యలు తీరడం లేదు. నీటి విడుదలకు ముందే అధికారులు స్పందించి కాలువల్లో పూడిక తొలగించాలని రైతులు కోరుతున్నారు.

# పదే పదే ఉల్లం'గనులు'



కరీంనగర్ : కరీంనగర్ జిల్లా నాగులమల్యాల, గట్టుబూత్కూర్, ఒద్యారం శివారులోని క్వారీల తవ్వకాలతో వాయు, జల కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నామని ఇటీవల కొందరు జాతీయ హరిత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. భూగర్భ జలవనరుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఈ ప్రాంతంలో గతంలో పరిశీలించినప్పుడు విస్తుపోయే వాస్తవాలు తెలిసొచ్చాయి. ఫ్లోరైడ్ సమస్య ఉండటంతోపాటు నత్రజని శాతం అధికంగా ఉందని.. జలం కలుషితమవుతుందనే నివేదికల్ని రూపొందించాయి. తాజాగా ఫిర్యాదుతోనూ మరోసారి యంత్రాంగం పరిశీలనకు సిద్ధమవుతోంది. ఇదే తరహాలో నాలుగు జిల్లాల పరిధిలో ఉన్న అన్నింటి వద్దా పరిశీలనలు చేపట్టాలనే డిమాండ్ ఉమ్మడి జిల్లా వాసుల నుంచి ఎప్పటి నుంచో వినిపిస్తోంది. 2011 మే 9న కాకినాడ పోర్టులో ఉమ్మడి జిల్లా నుంచి ఇతర దేశాలకు ఎగుమతి అయ్యే గ్రానైట్ బ్లాక్‌లను అప్పటి విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. పరిమితిని మించి రాయి ఎగుమతి చేస్తున్నారని గుర్తించి 9 గ్రానైట్ ఎగుమతి ఏజెన్సీలకు నోటీసుల్ని అందించారు. మైనింగ్ నిబంధనల ప్రకారం 1o5 పద్ధతిలో అపరాధ రుసుమును చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇలా అసలు రూ.124 కోట్లకు రూ.749 కోట్ల పైచిలుకు చెల్లించాలని ఆదేశించారు. దీంతో ఏజెన్సీలు అప్పటి ప్రభుత్వాన్ని ఆశ్రయించి కొంత మొత్తాన్ని మాత్రమే చెల్లించాయి. ఇదే విషయమై ఈడీకి ఫిర్యాదులందడం.. వాళ్లు కూడా ఇక్కడ సోదాలు చేసినా.. ఇప్పటికీ అపరాధ రుసుమును చెల్లించకపోవడం గమనార్హం. గ్రానైట్ క్వారీల నిర్వహణ.. వ్యాపారంలో నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలో ఏళ్లుగా సాగుతున్న ఈ వ్యాపారంలో అక్రమాలదే పైచేయి కనబడుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపమే శాపంగా వ్యాపారులు ఆడిందే ఆటగా మారిపోయింది. మైనింగ్ అధికారుల ఉదాసీనత.. వ్యాపారులకు ఉన్న రాజకీయ పలుకుబడి, పరిచయాలతో నిబంధనలు పక్కన పెడుతున్నారు. మామూళ్లకు అలవాటుపడిన కొందరు అధికారులు అక్రమాలు తెలిసినా పట్టించుకోవడం లేదు. ఇక్కడ చోటుచేసుకుంటున్న అక్రమాలపై ఉన్నతాధికారులు అడపాదడపా దృష్టి సారిస్తున్నా.. పూర్తి స్థాయిలో ఆగడాలకు అడ్డుకట్ట వేసిన దాఖలాలు లేవు. క్వారీల వల్ల స్థానికంగా పర్యావరణ సమస్యలు ఎదురవుతున్నాయని ఫిర్యాదులందుతున్నా పరిశీలనకే పరిమితమవుతున్నారు. చర్యలు మాత్రం కనపడటం లేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కరీంనగర్ జిల్లా అధికారి, ప్రాంతీయ స్థాయి పర్యవేక్షణ అధికారిపై సస్పెన్షన్ వేటుపడింది. క్షేత్రస్థాయిలో అక్రమాలపైనా ఇదే స్థాయిలో చర్యలుంటాయా అన్న చర్చ సాగుతోంది.

**ఏళ్లుగా ఇదే తంతు..**

నిషేధిత జాబితాలో ఉన్న క్వారీల్లో రాయిని తవ్వుతూ కొందరు వ్యాపారాన్ని సాగిస్తున్నా.. స్థానిక అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రతి నెలా ఎంత తవ్వుతున్నారు? ఎంత ఎగుమతి అనే వివరాలను పక్కాగా తీసుకోవడంలో లోపాలున్నాయి. కొన్ని క్వారీల జోలికి అధికారులు వెళ్లడం లేదు.క్వారీల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలనే ఆదేశాలు నాలుగు జిల్లాల్లో ఎక్కడా అమలు చేయడం లేదు. పేలుళ్ల విషయంలో నిబంధనలు బేఖాతరవుతున్నాయి. అనుమతి తీసుకున్న విస్తీర్ణం కన్నా.. ఎక్కువ విస్తీర్ణంలో తవ్వకాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నా, అధికారులు చర్యలపై దృష్టి పెట్టడం లేదు.అనుమతులు లేని క్వారీల విషయంలో లెక్కా పత్రమే లేకుండా పోయింది. లీజుల విషయంలోనూ నిబంధనల్ని ఉల్లంఘిస్తున్నవారి విషయంలో చర్యల్లేవు.క్వారీ వ్యాపారులతో కొందరు మైనింగ్ అధికారులు కుమ్మక్కవడంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతుందన్న ఆరోపణలున్నా చర్యలు లేవు.

# నిఘా లోపం... అక్రమార్కులకు ఆదాయం



సిరిసిల్ల :జిల్లాలో అటవీ ప్రాంతం ఎక్కువగా విస్తరించి ఉంది. అధికారుల నిఘా లోపం అక్రమార్కులకు ఆదాయంగా మారుతుంది. భారీ వర్షాలు, ఈదురు గాలులకు అడవిలోని చెట్లు నేలకొరుగుతాయి. కొన్ని ప్రాంతాల్లో స్మగ్లర్లు చెట్లను నరికివేస్తున్నారు. అధికారుల తనిఖీల్లో పట్టుబడిన వాటికి నంబర్లు వేసి, కలప డిపోకు తరలించాలి. ఇలా పోగుచేసిన వాటిని వేలం వేస్తే కావాల్సిన వారు కొనుగోలు చేసుకొంటారు. జిల్లాలో కలప డిపో లేకపోవడంతో కామారెడ్డికి తరలించాల్సి వస్తోంది. ఈ మధ్య కాలంలో సిబ్బంది అక్రమార్కులతో చేతులు కలుపుతున్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో ఏటా రూ.కోట్లలో అటవీశాఖ సంపద పక్కదారి పడుతోంది.

**ఇదీ పరిస్థితి**

జిల్లాలో ఏటా వర్షాలు, గాలులకు, ఇతర కారణాలతో చెట్లు పడిపోతున్నాయి. కింద పడిన వాటిని ఆయా సెక్షన్‌ల పరిధిలో అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని చోట్ల కలపను అంతా ఒక చోటకు చేర్చి నెలల తరబడి అలాగే కుప్పలుగా నిల్వ ఉంచుతున్నారు. ఇందులో నాణ్యమైన టేకు కలప రాత్రికి రాత్రే మాయమవుతుందన్న ఆరోపణలున్నాయి. సిరిసిల్ల, వేములవాడ డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డిపేట, గుండారం, వీర్నపల్లి, గర్జనపల్లి, మరిమడ్ల, రుద్రంగి, మల్యాల, మానాల, ప్రాంతాల్లో కలప అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. పడిపోయిన చెట్లు కలప డిపోకు తరలింపులోనూ అనేక అవకతవకలు జరుగుతున్నట్లు సమాచారం ఉంది.
కోనరావుపేట, నిజామాబాద్ గ్రామాల్లోని మినీ సామిల్లులను అధికారులు తనిఖీ చేయగా విలువైన టేకు దుంగలు భారీగా బయటపడ్డాయి. చందుర్తిలోనూ నిల్వ ఉంచిన కలపను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఎల్లారెడ్డిపేట మండలంలో కలప తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని సెక్షన్ కార్యాలయానికి తరలించారు. ఉదయం కలప డిపోకు తరలించే సమయానికి వాహనంతో సహా కలప మాయమైంది.పట్టుబడిన కలపను తరలించేందుకు ఏడాదికి ఒకసారి జిల్లా అటవీశాఖ నుంచి నిధులు విడుదలవుతుంటాయి. కొద్దిగా తరలిస్తే రవాణా ఖర్చులు అధికమవుతుంటాయని పట్టుబడిన వాటిని నెలల తరబడి అలాగే వదిలేస్తున్నారు. మరోవైపు జిల్లా వ్యాప్తంగా పడిపోయిన చెట్లు అక్కడే శిథిలమవుతున్నాయి. భారీ వృక్షాలను అలాగే వదిలేస్తుండటం అక్రమార్కులకు కలిసి వస్తోంది. వేములవాడ, సిరిసిల్ల డివిజన్లలో అనుమతి లేని మినీ సామిల్లులు ఉన్నాయి. వీటిపైన అధికారుల తనిఖీలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.
జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ రెండు డివిజన్ల కార్యకలాపాలు కరీంనగర్ నుంచి సాగుతున్నాయి. దీంతో ఇక్కడి సెక్షన్ల పరిధిలో పర్యవేక్షణకు ఉన్నతాధికారులు రావడంలో జాప్యం జరుగుతోంది. సమాచారం ఆలస్యమైతే అధికారులు వచ్చే లోపు ఇక్కడ అంతా సద్దుమణుగుతుంది. అటవీ ప్రాంతం విస్తరించిన చోట ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోవడం అక్రమార్కులకు బాగా కలిసివస్తోంది.

**తనిఖీలు చేస్తాం**

తనిఖీల్లో పట్టుబడినవి, సహజంగా నేలవాలిన చెట్లను క్షేత్రస్థాయిలో సిబ్బంది పరిశీలిస్తున్నారు. కేసులు నమోదైన తర్వాత కలప దుంగలు మాయమైతే సంబంధిత సిబ్బందిపైన చర్యలు తీసుకుంటాం. అధికారులకు పట్టుబడిన కలపను ఎక్కడ నరికారనే దానిపై విచారణ చేస్తాం. ఇటీవల వర్షాలకు పడిన చెట్లను కలప డిపోకు తరలించాం. కల్పన, ఎఫ్ఆర్వో, సిరిసిల్ల

# గురుకుల బాలలు.. ఆటల్లో మెరికలు


మంథని : మంథని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణిస్తున్నారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో క్రీడా పోటీల్లో పతకాల పంట పండిస్తున్నారు. విశాలమైన మైదానం, భవనాలు, పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తున్న పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతోంది. ఏటా పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు రావడం, విద్యార్థులు క్రీడల్లో రాణిస్తుండటంతో ఈ పాఠశాలలో పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారు.పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 550 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత విద్యాసంవత్సరం(2023-24)లో పదో తరగతిలో 100 శాతం, ఇంటర్మీడియట్‌లో 92 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 2022-23లో పదిలో 95 శాతం, ఇంటర్‌లో 92.6 శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. పరీక్షల సమయంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.

**ఆహ్లాదకర వాతావరణం**

పాఠశాల ఆవరణలో 500 చెట్లను పెంచుతుండటంతో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ఉదయం టిఫిన్, పాలు, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనంలో నాణ్యతతో కూడిన పదార్థాలను వడ్డిస్తున్నారు. సీసీ కెమెరా పర్యవేక్షణలో ఉండటంతో ప్రతి విద్యార్థి కదలికలను ప్రధానాచార్యులు పర్యవేక్షిస్తున్నారు. ప్రతి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డిజిటల్ తరగతులు, కంప్యూటర్, ప్రొజెక్టర్ వంటి వసతులు అందుబాటులో ఉండటంతో సాంకేతిక పాఠాలు బోధిస్తున్నారు.

**రోజూ 3 గంటలు సాధన**

ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, టెన్నిస్, చదరంగం, హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ తదితర క్రీడల్లో విద్యార్థులు నిత్యం తర్ఫీదునిస్తున్నారు. ఉదయం, సాయంత్రం కలిపి మొత్తం 3 గంటల పాటు సాధన చేస్తున్నారు. 2020 నుంచి ఇప్పటివరకు ఈ పాఠశాల నుంచి 10 మంది బాక్సింగ్, టెన్నికాయిట్, ఖోఖో, కబడ్డీ విభాగాల్లో



జాతీయ స్థాయిలో ఆడారు. 2021-22, 2022-23 సంవత్సరాల్లో ఖేలో ఇండియా జాతీయ స్థాయి పోటీల్లో ఖోఖో విభాగంలో ఇద్దరు చొప్పున రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. గత నెలలో ములుగు జిల్లా జాకారంలో నిర్వహించిన కాళేశ్వరం జోన్ 10వ అథ్లెటిక్స్‌లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను మంథని గురుకుల విద్యార్థులు కైవసం చేసుకున్నారు.

**జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్నా..** అయిదో తరగతిలో పాఠశాలలో చేరాను. ఆటలంటే నాకు ఆసక్తి. అండర్-19 విభాగంలో జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో మహారాష్ట్రలో పాల్గొన్నా. పదో తరగతిలో ఉన్నపుడు సీఎం కప్ క్రీడల్లోనూ ఆడాను. ఆర్.అరవింద్, ఇంటర్ ద్వితీయ సంవత్సరం
అయిదు పతకాలు సాధించాగత నెలలో జాకారంలో నిర్వహించిన కాళేశ్వరం జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని అయిదు అంశాల్లో ఆడాను. ఓవరాల్ ఛాంపియన్ సాధించాను. 100, 200 మీటర్ల పరుగు పందెంలో 2 బంగారు, 3 రజత పతకాలు సాధించాను. ఎం.సాత్విక్, ఇంటర్ మొదటి సంవత్సరం
కబడ్డీలో రన్నర్‌గా నిలిచాం అయిదో తరగతిలో గురుకులంలో చేరాను. జాకారంలో జరిగిన పోటీల్లో కబడ్డీలో మా పాఠశాల తరఫున ఏడుగురు సభ్యులం పాల్గొని ఓవరాల్ ఛాంఫియన్‌షిప్‌లో రన్నర్‌గా నిలిచాం. టి.మహర్షి, పదో తరగతి
ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధవిద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేలా నాణ్యమైన భోజనం వడ్డించడంతో పాటు క్రీడల్లో నిత్యం సాధన చేయిస్తున్నాం. చదువు, ఆటల్లో విద్యార్థులు రాణించేలా ప్రతి ఒక్కరిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం. శ్రీనాథ్, ప్రిన్సిపల్

## హౌసింగ్ బోర్డు స్థలాలకు రక్షణ గోడలు

హైదరాబాద్: ఆ ఖాళీ స్థలాల(ప్లాట్లు)కు రక్షణ గోడల నిర్మాణానికి హౌసింగ్ బోర్డు శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా చెత్తాచెదారంతో నిండిపోయిన ఆ స్థలాలకు రూపు తీసుకురావాలని నిర్ణయించింది. ఖాళీగా ఉన్న ప్లాట్లను విక్రయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వటంతో హౌసింగ్ బోర్డు రంగంలోకి దిగింది. స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించింది. సుమారు 20 ప్యాకేజీలుగా విభజించి గోడలు నిర్మించాలని నిర్ణయించారు. సుమారు రూ.463 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఒకపక్క ప్రహరీ గోడల నిర్మాణంతో పాటు సాంకేతికంగా ఆయా ప్లాట్లకు జియో ట్యాగింగ్ పనులు కూడా చేపట్టేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొత్తం ప్యాకేజీల్లో కేవలం వరంగల్, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్‌లలో ఆరు మాత్రమే ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో 7,885 మీటర్ల మేరకు గోడలు నిర్మించనున్నారు. మిగిలిన 14 ప్యాకేజీలు గ్రేటర్ పరిధిలోనే ఉన్నాయి.



వట్టినాగులపల్లి, చింతల్, రాయదుర్గం, బాచుపల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, కైత్లాపూర్, మల్కాజిగిరి, కొహెడ, మంగళపల్లి, రావిర్యాల తదతర ప్రాంతాల్లో నిర్మించాలని నిర్ణయించారు. సుమారు 24,066 మీటర్ల మేర ప్రహరీలు నిర్మించాల్సి ఉంది.

**రెండు నుంచి మూడు నెలల్లో...**

ప్రహరీల నిర్మాణాలను రెండు నుంచి మూడు నెలల్లో పూర్తి చేయాలని హౌసింగ్ బోర్డు నిర్ణయించింది. గోడల నిర్మాణం తరవాత వాటికి గతంలో కేటాయించిన ప్లాట్ నంబర్లు, విస్తీర్ణం తదితర వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయనుంది. విక్రయానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో ప్రహరీల పనులు ప్రారంభించినట్లు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఆయా ఖాళీ ప్లాట్ల విక్రయం ఎప్పటి నుంచి చేపట్టాలన్నది తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. గ్రేటర్‌లోని ప్లాట్ల విక్రయం ద్వారా సుమారు రూ.1,200 కోట్లకుపైగా ఆదాయం వస్తుందని అంచనా.

## వ్యవసాయ గణనకు రంగం సిద్ధం

సిరిసిల్ల : జిల్లాలో వ్యవసాయ గణనకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే మొదటి దశ పూర్తి కాగా రెండు, మూడు దశల గణనను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని భావిస్తున్నారు. దేశంలో ఏ రకమైన రైతులు ఏవిధంగా ఉన్నారు, ఎవరికి ఎంత విస్తీర్ణంలో భూమి ఉందనే విషయాలను తెలుసుకోవడానికి భారత ప్రభుత్వం ప్రతి అయిదేళ్లకు ఒకసారి వ్యవసాయ గణన చేపడుతుంది. దీనివల్ల రైతులకు కావాల్సిన పథకాల అమలు కోసం నిర్ణయాలు తీసుకోవడానికి వీలుంటుంది. ఇది మూడు దశల్లో కొనసాగుతుంది. మొదటిది సామాజిక వర్గంగా, రెండోది సన్న, చిన్నకారు రైతుల విస్తీర్ణం పరంగా, మూడోది స్త్రీ, పురుషుల వారీగా గణన చేపట్టనున్నారు. దీని ఆధారంగా దేశంలోని రైతులకు ఏ రాష్ట్రంలో, ఏ జిల్లాలోని రైతులకు ఏ విధమైన అవసరాలు ఉన్నాయి, ఏ విధమైన సౌకర్యాలు కల్పించాలి, ఎలాంటి సంక్షేమ పథకాలు అందించాలనే నిర్ణయం కేంద్రం తీసుకోనుంది. ఇందులో భాగంగా జిల్లాలో 2021-22 సంవత్సరానికి గాను వ్యవసాయ గణనను 2024 డిసెంబరులో ప్రారంభించారు. ఇప్పటికే మొదటి దశ గణనను పూర్తి చేశారు.
జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో రెండో దశ వ్యవసాయ గణనకు ఎన్యూమరేటర్లుగా ఏఈవోలు, పర్యవేక్షకులుగా మండల ప్రణాళిక, గణాంక అధికారులు వ్యవహరించనున్నారు. మూడో దశలో మండల ప్రణాళిక, గణాంక అధికారులు ఎన్యూమరేటర్లుగా, డిప్యూటీ గణాంక అధికారులు పర్యవేక్షకులుగా వ్యవహరించనున్నారు. మండల



వ్యవసాయ అధికారులు ఇన్‌ఛార్జులుగా ఉండనున్నారు. గతంలో దీనిని మాన్యువల్‌గా నిర్వహించారు. ప్రస్తుతం చరవాణితోపాటు ట్యాబ్‌లను వినియోగించి వివరాలు నమోదు చేయనున్నారు. దీనివల్ల రైతుల వివరాలు నమోదు చేయగానే నేరుగా సంబంధిత శాఖకు వెళ్తాయి. జిల్లాలో మొత్తం 171 రెవెన్యూ గ్రామాలు ఉండగా, వాటిలో ఎంపిక చేసిన గ్రామాల్లోనే వ్యవసాయ గణన చేయనున్నారు.
మొదటి దశ గణనను పూర్తి చేశారు. జిల్లాలోని రెవెన్యూ గ్రామాల వారీగా సన్న, చిన్నకారు, మధ్య తరగతి, పెద్ద రైతుల వివరాలు, వారి సామాజిక వర్గం, వారికి ఉన్న భూముల వివరాలను సేకరించారు. జిల్లాలో 20 శాతం రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో ఉన్న సన్న, చిన్నకారు, పెద్ద రైతుల భూముల్లో సాగు విస్తీర్ణం, సర్వే నంబర్ల వారీగా వివరాలు, ఆయా భూముల్లో ఏ రకమైన పంటలు పండించారు, వాటికి ఏ రకమైన నీటి వసతులు ఉన్నాయి, ఏ రకమైన పంటలు పండిస్తున్నారనే వివరాలు సేకరించనున్నారు.
మూడో దశ గణనకు జిల్లాలోని 7 శాతం రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలకు ఉపయోగించిన వివిధ రకాల విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, పరికరాలు, వాటికి అవసరమైన వనరులను ఎక్కడి నుంచి సేకరించారనేది తెలుసుకుంటారు.

**31 నాటికి పూర్తి చేస్తాం**

జిల్లాలో ఇప్పటికే మొదటి దశ వ్యవసాయ గణనను పూర్తి చేశాం. ప్రస్తుతం రెండు, మూడో దశల్లో గణనను ఈ వారంలో ప్రారంభిస్తాం. ఇప్పటికే వ్యవసాయ అధికారులతో పాటు మండల ప్రణాళిక, గణాంక అధికారులకు శిక్షణ ఇచ్చాం. జిల్లాలో ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 31 నాటికి జిల్లాలో వ్యవసాయ గణనను పూర్తి చేస్తాం. శ్రీనివాసచారి, జిల్లా ప్రణాళిక అధికారి

# నగరానికి 84వేల ఇందిరమ్మ ఇళ్లు

హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై జీహెచ్ఎంసీ కసరత్తు ప్రారంభించింది. ప్రజాపాలన సభల ద్వారా ప్రభుత్వ పథకాల కోసం అందిన దరఖాస్తుల పరిశీలనకు నడుంబిగించింది. త్వరలో ప్రక్రియను ప్రారంభించాలని కమిషనర్ ఇలంబర్తి జోనల్ కమిషనర్లను(జెడ్సీ) ఆదేశించారు. దరఖాస్తుల ఆధారంగా ఇంటింటి సర్వే చేపట్టి, దరఖాస్తుదారుల అర్హతలను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఇటీవల ఆవిష్కరించిన 'ఇందిరమ్మ ఇళ్లు' మొబైల్ యాప్‌లో వివరాలను నమోదు చేయాల్సి ఉంది. గ్రేటర్‌లో సర్వేను పూర్తి చేసేందుకు 900 మంది సర్వేయర్లు అవసరమని, అవసరమైన మేర సిబ్బందిని సమకూర్చాలని రంగారెడ్డి, హైదరాబాద్,



మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, కంటోన్మెంట్ బోర్డు సీఈఓను కోరుతూ జీహెచ్ఎంసీ లేఖ పంపింది.

**నెలలో పూర్తి చేయాలంటూ..**

మొదటి దశలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లను కట్టించేందుకు సర్కారు నిర్ణయం తీసుకుంది. "దాని ప్రకారం.. జీహెచ్ఎంసీలోని 24 నియోజకవర్గాలకు 84వేల ఇళ్లు నిర్మించాల్సి ఉంటుంది. మరోవైపు.. ప్రజాపాలన సభల్లో మొత్తం 10,70,446 దరఖాస్తులందాయి. డివిజన్ల వారీగా ఆయా దరఖాస్తులను విభజించి సర్వే చేపట్టాలన్నది బల్దియా ప్రణాళిక. అన్ని దరఖాస్తులను నెలరోజుల్లో పరిశీలించాలంటే 900 మంది అవసరం. జీహెచ్ఎంసీకి చెందిన 409 మంది సిబ్బందికి సర్వే విధులను కేటాయిస్తున్నాం."అని కమిషనర్ లేఖలో పేర్కొన్నారు. మరో 488 మంది సిబ్బందిని సమకూర్చాలని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లకు, కంటోన్మెంట్ బోర్డు సీఈఓకు బల్దియా కమిషనర్ కోరారు. త్వరలోనే సర్వేయర్లకు మొబైల్ యాప్ వినియోగంపై శిక్షణ ఇస్తామని సూచించారు.

# మహిళల్లో.. రొమ్ము క్యాన్సర్లే ఎక్కువ

హైదరాబాద్: మహిళలపై రొమ్ము క్యాన్సర్ పడగ విప్పుతోంది. ఏటా కేసుల సంఖ్య పెరుగుతుండటం గమనార్హం. ప్రభుత్వ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షల్లో రొమ్ము క్యాన్సర్ల సంఖ్య ఆందోళనకరంగా పెరుగుతోంది. 2021లో 1,240 కేసులు నమోదైతే.. 2023 నాటికి 1,591కు చేరాయి. 80శాతం మంది వ్యాధి ముదిరిపోయిన దశలో ఆసుపత్రికి వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. గతంలో పట్టణాల్లోని మహిళల్లో ఎక్కువగా రొమ్ము క్యాన్సర్లు బయట పడేవన్నారు. ప్రస్తుతం స్క్రీనింగ్ పరీక్షలు పెరిగిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లోనూ పెద్దసంఖ్యలో వెలుగులోకి వస్తున్నాయని చెప్పారు. 40ఏళ్లు దాటిన ప్రతి మహిళా ఏటా మామోగ్రామ్ పరీక్షలు చేయించుకోవడం వల్ల ముందే గుర్తించవచ్చు. రొమ్ముల్లో గడ్డలు లాంటివి చేయికి తగిలితే వైద్యులను సంప్రదించాలి. వ్యాధి నిర్ధారణ అయితే ఎంఎన్‌జేలో పూర్తి ఉచితంగా చికిత్సలు



అందిస్తున్నారు. డిజిటల్ మామోగ్రామ్ పరీక్షలు కూడా ఉచితంగా చేయించుకోవచ్చు. జన్యుపరంగా కుటుంబ సభ్యుల్లో ఎవరైనా క్యాన్సర్ బారిన పడితే మిగతా వారు ముందే బ్రాకా-1, బ్రాకా-2 జన్యు పరీక్షలతో వ్యాధి జన్యువులను గుర్తించే అవకాశం ఉందని తెలిపారు. ఈ పరీక్షలు సైతం అందుబాటులో ఉన్నాయన్నారు. బరువును నియంత్రణలో పెట్టుకోవడం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం, రోజూ గంటపాటు వ్యాయామం, స్క్రీనింగ్ పరీక్షలతో రొమ్ము క్యాన్సర్ల బారిన పడకుండా చూసుకోవచ్చు.

**ప్రధాన కారణాలు ఇవే..**

జీవనశైలిలో మార్పులు
అధిక బరువు / ఊబకాయం
ఆలస్యంగా వివాహాలు, పిల్లలను కనడం
మహిళల్లో ధూమపానం, ఆల్కహాల్ అలవాటు
కదలకుండా కూర్చొని పనిచేసే ఉద్యోగాలు
జన్యుపరమైన కారణాలు
దీర్ఘకాలం రేడియేషన్‌కు బహిర్గతం కావడం.

# జంప్డ్‌తో జరభద్రం

నారాయణగూడ :ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఫోన్‌పే, జీపే, పేటీఎం ఇతర థర్డ్‌పార్టీ మొబైల్ మనీ యాప్‌ల ద్వారా చెల్లింపులు చేసేప్పుడు అప్రమత్తంగా ఉండాలని సైబర్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల సైబర్ మోసగాళ్లు 'జంప్డ్' అనే కొత్త టెక్నిక్‌తో మోసాలకు పాల్పడుతున్నట్లు చెబుతున్నారు. అందులో మోసగాడు తన నంబరును ఉపయోగించి బాధితుల ఖాతాల్లో రూ.5 వేలు, అంతకంటే తక్కువ జమ చేస్తాడు. ఆ తర్వాత మీరు కొంత డబ్బు అందుకున్నా




రంటూ ఫోన్‌లో సందేశం పంపించి.. కింద లింక్ పంపిస్తాడు. సాధారణంగా సందేశాన్ని తెరిచి.. పిన్ నంబరు నమోదు చేస్తాం. ఆ క్షణమే మోసగాళ్లకు మన ఖాతాలో ఉపసంహరణ అభ్యర్థనను ధ్రువీకరించినట్లే. ఆ తర్వాత ఖాతా అతనికి యాక్సెస్ అవుతుంది. ఆ మోసగాడు స్వయంగా ఆ ఖాతాలోని డబ్బును యజమానిలా అధికారికంగా విత్‌డ్రా చేసుకుంటాడు. ఖాతాలో గుర్తు తెలియని నంబర్ల ద్వారా చిన్న మొత్తాలు జమ అయ్యాయంటే మోసమని గ్రహించాలి.

**ఇలా చేయండి**బ్యాలెన్స్‌ను చెక్ చేయడానికి ముందు మీ వాస్తవ పిన్ నంబరు నమోదు చేయకుండా తప్పుడు నంబరు నమోదు చేయండి. దీంతో అవతలి వ్యక్తి ప్రయత్నానికి అడ్డుకట్ట పడుతుంది. ఆ తర్వాత నిజమైన పిన్ నంబరుతో బ్యాలెన్స్‌ను తనిఖీ చేసుకోవాలి.

# పల్లె పోరుకు కసరత్తు షురూ!



వికారాబాద్ : జిల్లాలో గ్రామ పంచాయతీల ఎన్నికలకు సంబంధించి అధికారులు కసరత్తు వేగవంతం చేస్తున్నారు. ఇప్పటికే ఓటర్ల జాబితాను కొలిక్కి తీసుకు రావడంతోపాటు బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల సిబ్బందికి ప్రవర్తనా నియామావళి పుస్తకాలు, విధులు నిర్వహించే అధికారుల శిక్షణకు సంబంధించిన పుస్తకాలు పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నాయి.

**19 కొత్త గ్రామ పంచాయతీలు**

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 19 గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. వాటిలో 8 గిరిజన తండాలుంటే మిగిలినవి 11 గ్రామాలే. వీటికి కూడా పాత గ్రామ పంచాయతీలతో కలిపే ఎన్నికలు జరుగుతాయి. ధారూర్ మండలం లక్ష్మీనగర్ తండా, కొండాపూరు కుర్దు, మోమిన్ పేట మండలం రావుల పల్లి, మర్పల్లి- రాంపూరు, కుడుగుంట, బంట్వారం- మంగ్రాస్ పల్లి, పూడూరు- రాకం చర్ల, కుల్కచర్ల- దీప్లనాయక్ తండా, పెద్దేముల్- తింసాన్‌పల్లి, బొంరాస్‌పేట- సోమ్లనాయక్ తండా, కట్టుకాల్వ తండా, సీత్యానాయక్ తండా, దౌల్తాబాద్- తిమ్మాయిపల్లి, తిర్మలాపూరు, యాలాల మండలం దేవుల తండా, పేర్కంపల్లి తండా, బషీరాబాద్ మండలం మల్కన్‌గిరి, పెర్యానాయక్ తండా, గంగ్వార్ గ్రామాలు కొత్త పంచాయతీలుగా ఏర్పాటయ్యాయి.

**విడతల వారీగా ఎన్నికలు**

జిల్లాలో గ్రామ పంచాయతీల ఎన్నికలు విడతల వారీగా జరగనున్నాయి. ప్రతి గ్రామ పంచాయతీలోని ప్రతి వార్డుకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్యను బట్టి ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులు విధులు నిర్వహిస్తారు. పాత రిజర్వేషన్లు కాకుండా కొత్తగా రిజర్వేషన్‌లు ఖరారైతే ఏ గ్రామ పంచాయతీ ఏ కేటగిరి కిందకు వెళుతుందో అని సర్వత్రా చర్చ జరుగుతోంది. **200 ఓటర్లకు ఒక కేంద్రం**

అసెంబ్లీ ఎన్నికలకు 1200 ఓటర్ల వరకు ఒక పోలింగ్ కేంద్రం ఉండగా అదే పంచాయతీకి వచ్చే సరికి 200 ఓటర్లు లోపు ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ ఎన్నికలకు సిబ్బంది ఎక్కువగానే కావాలి. ఎప్పుడు ప్రకటించినా సిద్ధంగా ఉంటాం- జయసుధ, జిల్లా పంచాయతీ అధికారిణి, వికారాబాద్.

జిల్లాలో కొత్తగా 19 పంచాయతీలు ఏర్పాటు చేశారు. దీంతో 585 గ్రామ పంచాయతీలు అయ్యాయి. పాత, కొత్త తేడా లేకుండా అన్నింటికీ ఎన్నికలు జరుగుతాయి. మందస్తుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఎన్నికల తేదీ ఎప్పుడు ప్రకటించినా నిర్వహణకు సిద్ధంగా ఉంటాం.

# డ్వాక్రా రుణం.. వేగం పెంచితేనే లక్ష్యం!



తాండూరు : మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేలా రుణాలు మంజూరు చేస్తూ ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రుణ పంపిణీకి నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేయాలంటే మరింత వేగం పెంచాల్సి ఉంది. రుణ మంజూరు గడువు మార్చి కాగా ఇంకా 41 శాతం లక్ష్యం సాధించాల్సి ఉంది. ఈ నేపథ్యంకథనం.

**సెర్ప్ ద్వారా మంజూరు**

జిల్లాల్లోని 19 మండలాల్లోని గ్రామీణ ప్రాంత స్వయం సహాయక సంఘాల మహిళలకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) అధికారులు రుణాల్ని మంజూరు చేస్తున్నారు. నాలుగు మున్సిపాలిటీల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు మెప్మా ద్వారా అందిస్తున్నారు. మిగతా పంపిణీ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ఏపీఎంలు, ఐకేపీ సీసీలు, వీఓఏలు మరింత వేగంగా నిర్వహించాల్సి ఉంది.

**పదుల సంఖ్యలో వ్యాపారాలు, చెల్లింపులు**

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు పదుల సంఖ్యలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. రూ.లక్ష నుంచి రూ.3లక్షల దాకా అందిస్తున్న బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేస్తున్న మహిళలు హోటళ్లు, సూపర్ మార్కెట్, విగణిత కేంద్రాలు, సౌర విద్యుత్ దీపాల విక్రయాలు, బ్యూటీపార్లర్, అలంకార వస్తు విక్రయాలు, దర్జీ దుకాణాలు, దుస్తులు విక్రయాలు, పాడి పశు పోషణ, వ్యవసాయం చేస్తు రాణిస్తున్నారు. నెలనెలా ఆదాయం పొందుతూ వచ్చిన దాంట్లోంచి వాయిదాలు చెల్లిస్తూ రుణాల్ని సకాలంలో తీర్చుతున్నారు.

**కోట్‌పల్లి ప్రథమం.. చివరన దౌల్తాబాద్**

ఆర్థిక సంవత్సరం రుణాల మంజూరులో కోట్‌పల్లి మండలంలో అత్యధికంగా 92 శాతం లక్ష్యం పూర్తవడంతో జిల్లాలో ప్రథమ స్థానానికి చేరింది. అత్యల్పంగా 34 శాతం రుణాల పంపిణీతో దౌల్తాబాద్ మండలం ఆఖరు స్థానంలో నిలిచింది. తాండూరు, చౌడాపూర్, బంట్వారం మండలాల్లో 81 శాతం రుణాల పంపిణీ పూర్తయింది. వికారాబాద్ మండలంలో 38 శాతం లక్ష్యం పూర్తి చేశారు.

**ఫిబ్రవరిలోగా వంద శాతం సాధిస్తాం**

జిల్లాలో డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాల మంజూరులో వేగం పెంచుతాం. రెండు నెలల్లో రుణాల పంపిణీ పూర్తి చేసి శతం శాతం లక్ష్యాన్ని చేరుకుంటాం. అందుకు అనుగుణంగా రుణాల అందజేతపై ప్రతినెలా మండల, గ్రామ స్థాయి సిబ్బందితో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నాం. - నర్సింహులు, డీపీఎం, గ్రామీణాభివృద్ధి శాఖ.

జిల్లాలో మండల సమాఖ్యలు: 19
గ్రామ సమాఖ్యలు: 657
స్వయం సహాయక సంఘాలు: 15,697
నమోదైన సభ్యులు: 1,62,794
ఆర్థిక సంవత్సరం రుణ లక్ష్యం: రూ.554.49కోట్లు
పూర్తయింది : రూ.325.71కోట్లు
ఇవ్వాల్సింది: రూ.228.77కోట్లు

# స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకు మెరుగుపడేనా!

గోదావరిఖని : బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత(ఓడీఎఫ్) విభాగంలో కేవలం ఓడీఎఫ్ ప్లస్ ధ్రువీకరణకు మాత్రమే పరిమితమైన రామగుండం నగరపాలిక ఈ సారి ఓడీఎఫ్ఫం కోసం దరఖాస్తు చేసుకుంది. త్వరలో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించాక ఇచ్చే నివేదిక ఆధారంగా ధ్రువీకరణ లభించే అవకాశం ఉంది. ఇంటింటా మరుగుదొడ్డి ఉండటంతో పాటు వ్యర్థాలను శుద్ధిచేసి బయటకు పంపించేలా ఇంటింటా సెప్టిక్ ట్యాంకు ఉంటేనే ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ ధ్రువీకరణతో పాటు స్టార్ రేటింగ్ సైతం పెరగనుంది. దీనిద్వారా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సైతం మార్కులు పెరగడంతో ర్యాంకు మెరుగుపడే అవకాశం ఉంది.

**మానవ వ్యర్థాల శుద్ధీకరణ ఆధారంగా...**

మరుగుదొడ్ల నుంచి వెలువడే మానవ వ్యర్థాలను శుద్ధి చేస్తున్న తీరును బట్టి 'ఓడీఎఫ్' ధ్రువీకరణ లభిస్తుంది. వీటితో పాటు నగరంలోని మురుగు జలాలను సైతం శుద్ధిచేసి బయటకు వదలడాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. మానవ వ్యర్థాల శుద్ధీకరణే ఓడీఎఫ్ ధ్రువీకరణలో కీలకం కావడంతో రామగుండం నగరపాలిక ఆ దిశగా ప్రయత్నిస్తుంది. దీనిలో భాగంగా మల్కాపూర్ శివారులో ప్రత్యేకంగా ఫికల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంటు(ఎఫ్.సి.టి.పి.)నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చారు. గతంలో నిర్మాణం పూర్తయినప్పటికీ వినియోగంలోకి రాకపోవడంతో రామగుండం నగరపాలిక ఓడీఎఫ్ ప్లస్‌తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకు సైతం ఆశించిన మేరకు లభించలేదు.



ఈసారి ఎలాగైనా మెరుగైన ర్యాంకు సాధించాలనే లక్ష్యంతో ఓడీఎఫ్ఫం ధ్రువీకరణకు అవసరమైన దస్త్రాలు, పూర్తి నివేదికలతో దరఖాస్తు చేసుకున్నారు. **మార్కుల కేటాయింపు ఇలా...**

సాధారణంగా ఓడీఎఫ్ ధ్రువీకరణకు కేవలం 100 మార్కులు మాత్రమే కేటాయించనుండగా ఓడీఎఫ్ ప్లస్‌కు 200, ప్లస్ ప్లస్ ధ్రువీకరణకు 500 మార్కులు కేటాయించనున్నారు. వీటి ఆధారంగా స్టార్ రేటింగ్ ఇవ్వనున్నారు. కేవలం ఓడీఎఫ్ గుర్తింపు మాత్రమే ఉంటే సింగిల్ స్టార్ రేటింగ్‌లో 200 మార్కులు కేటాయిస్తారు. ఓడీఎఫ్ ప్లస్ ఉంటే త్రీస్టార్ రేటింగ్‌లో 600, ప్లస్ ప్లస్ ఉంటే ఫైవ్‌స్టార్ రేటింగ్‌తో 900 మార్కులు కేటాయిస్తారు. గత ఏడాది రామగుండం నగరపాలికకు కేవలం ఓడీఎఫ్ ప్లస్ ధ్రువీకరణ మాత్రమే ఉండటంతో 200 మార్కులు, స్టార్ రేటింగ్‌లో త్రీస్టార్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. ఈ సారి ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ లభిస్తే దీని ద్వారా 500 మార్కులు, రేటింగ్‌లో ఫైవ్‌స్టార్‌తో 900 మార్కులు వెరసి 1400 మార్కులు సాధించే అవకాశముంటుంది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు సాధనకు దోహదపడే అవకాశముంది.

# మరో వెయ్యి మెగావాట్ల పవర్

హైదరాబాద్ : నగరంలో విద్యుత్తు నెట్‌వర్క్ గరిష్ఠ లోడ్ సామర్థ్యం ప్రస్తుతం 9675 మెగావాట్లుగా ఉంది. వేసవిలో పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా ఈ సామర్థ్యానికి మరో 1000 మెగావాట్లను జోడించబోతున్నారు. ఇందుకోసం కొత్త ఉపకేంద్రాల నిర్మాణం, పాత కేంద్రాల్లో అదనంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు వంటి చర్యలను టీజీఎస్పీడీసీఎల్ చేపడుతోంది. పరిశ్రమలు, రియల్ ఎస్టేట్ కార్యకలాపాలకు శివారు ప్రాంతాలు నిలయంగా మారడంతో విద్యుత్తు డిమాండ్ పెరుగుతోంది. దీంతో నెట్‌వర్క్ సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా కసరత్తు చేపట్టింది.కొత్త ఉపకేంద్రాల నిర్మాణానికి ఇప్పటికే జోన్ల వారీగా సింగిల్ టెండర్లను ఆహ్వానించింది. 12.5 ఎంవీఏ సామర్థ్యమున్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయబోతోంది. ఏ ట్రాన్స్‌ఫార్మర్ లోడ్ కూడా 60 శాతం మించొద్దు అనేది డిస్కం



ప్రణాళికగా ఉంది.

**మెట్రోజోన్‌లో అధికంగా..**

బంజారాహిల్స్, హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్, సికింద్రాబాద్ సర్కిళ్లు ఉండే మెట్రోజోన్ పరిధిలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల లోడ్‌ను ఇప్పుడున్న దానికి 450 ఎంవీఏ జోడించబోతున్నారు. 36 ఉపకేంద్రాలకు సింగిల్ టెండర్‌కు నెలాఖరు వరకు గడువు ఇచ్చారు. ఈ పనులకు దాదాపు రూ.100 కోట్ల వ్యయం కానుంది.

**రంగారెడ్డి జోన్‌లో..** రాజేంద్రనగర్, సైబర్‌సిటీ, సరూర్‌నగర్, వికారాబాద్ సర్కిళ్ల పరిధిలో 300 ఎంవీఏ సామర్థ్యం కల్గిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్లతో 34 ఉపకేంద్రాల నిర్మాణం టెండర్ల దశలో ఉంది. అవుటర్ బయటనే అత్యధికం ఉన్నాయి. ఈ పనులకు దాదాపు రూ.100 కోట్ల వ్యయం కానుంది. ః సైబరాబాద్ సర్కిల్‌లో బొటానికల్ గార్డెన్, నల్లగండ్ల, హఫీజ్‌పేట, 8వ బెటాలియన్ ప్రాంతంలో కొత్త ఉపకేంద్రాలు రానున్నాయి. **మేడ్చల్ జోన్‌లో..**హబ్సిగూడ, మేడ్చల్, సంగారెడ్డి సర్కిళ్ల పరిధిలో 225 ఎంవీఏ సామర్థ్యంతో 18 చోట్ల కొత్త ఉపకేంద్రాలకు టెండర్లు పిలిచారు. రూ.50 కోట్ల వ్యయంతో పనులు చేపట్టనున్నారు. హబ్సిగూ డ సర్కిల్‌లో వెంకటాపూర్, మేడిపల్లి, శంబిపూర్‌లలో కొత్త ఉపకేంద్రాలు కట్టనున్నారు.

# బెదురు లేదు.. కూల్చుతారన్న భయం లేదు!

అల్వాల్ : అల్వాల్ సర్కిల్ పరిధిలో అక్రమ కట్టడాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ప్లాన్‌తో సంబంధం లేకుండా సెల్లార్లు, అదనపు అంతస్తులతో చేపడుతున్న నిర్మాణాలను నియంత్రించాల్సిన సర్కిల్ ప్రణాళిక విభాగం సిబ్బంది కొరత అంటూ తాఖీదులు జారీ చేస్తూ చేతులు దులుపుకొంటోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు కానిచ్చేస్తున్నారని పలువురు పేర్కొం టున్నారు. సర్కిల్ మూడు డివిజన్ల పరిధిలో పలుచోట్ల నిబంధనలు ఉల్లంఘించి.. ప్రధాన రహదారులను ఆనుకునే నిర్మాణాలు యథేచ్ఛం గా చేపడుతున్నారు. ప్రాథమిక దశలో అడ్డుకునే అవకాశం ఉన్నా అంతస్తులు పూర్తయ్యాక అధికారులు స్పందించడం వివాదాలకు కారణమవుతోంది. అది కూడా సామాన్యుల విషయంలో ఒకరకంగా పలుకుబడి ఉన్న వారి విషయంలో మరోరకంగా స్పందిస్తున్నారన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

**ఫిర్యాదుల వెల్లువ**

అక్రమమని తేలితే ఎంత పెద్ద నిర్మాణాన్ని అయినా కూల్చివేస్తామని యంత్రాంగం ప్రకటించింది. కానీ ఎక్కడా చర్యలు చేపట్టకపోవడంతో అక్రమ నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఇలాంటివాటిపై కొందరు సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ప్రధాన రహదారిని ఆనుకొని నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై కఠినంగా వ్యవహరించాలని ఉన్నతాధికారుల నుంచి వత్తిడి పెరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలపై కూల్చివేతకు ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం.



ఈ క్రమంలో కొందరు ప్రజాప్రతినిధుల పేర్లు తెరపైకి తెస్తున్నా వారు తమకు సంబంధం లేదని ప్రకటిస్తున్నారు.

**అక్రమాలకు కొన్ని తార్కాణాలివిగో..**

మచ్చబొల్లారం పాకాల కుంటలోని ఓ అక్రమ లేఅవుట్‌లో ఐదేళ్ల నుంచి అనుమతులను పెండింగ్‌లో పెట్టారు. సీలింగ్ పరిధిలో ఉన్న ఈ లేఅవుట్‌లో కొన్ని నెలల క్రితం అనుమతులు జారీ అయ్యాయి. ప్రధాన రహదారిని ఆనుకొని సాధారణ భవనం అనుమతితో సెల్లార్‌తో కూడిన వాణిజ్య పరమైన భారీ కట్టడాన్ని పూర్తి చేస్తున్నారు.

లోతుకుంటలో చిన్న స్థలంలో ఐదంతస్తుల నిర్మాణం పూర్తి చేశారు.

జలవనరుగా గుర్తించిన బొల్లారం కుంట స్థలంలో అనుమతి పెండిం గ్‌లో ఉండగానే ఐదంతస్తుల భవనం పనులు చేపట్టారు.

కానాజిగూడ, ఓల్డ్అల్వాల్, హైటెన్షన్ మార్గం, తిరుమల ఎన్‌క్లేవ్, మధురానగర్ ప్రాంతాల్లో ఇలాంటి నిబంధనలు అతిక్రమించి నిర్మాణా లు కట్టేస్తున్నారు.సీజ్ చేస్తాం: శ్రీనివాస్‌రెడ్డి, ఉపకమిషనర్తాఖీదులు జారీ చేసిన ప్రతి నిర్మాణంపై చర్యలకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే కొన్ని కట్టడాలను తొలగించాం. నిబంధనలు అతిక్రమించి పూర్తి చేసే భవనాలను సీజ్ చేసేలా చర్యలు ఉంటాయి.

# పునర్వినియోగంపై చెత్తశుద్ధి ఏదీ!

గోదావరిఖని : వ్యర్థాల నిర్వహణలో పాలకుల పట్టింపులేనితనం, అధికారుల నిర్లక్ష్యంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. తడి, పొడి చెత్తను ఇంటి నుంచే వేర్వేరుగా సేకరించాలని ప్రభుత్వాలు ఆదేశిస్తున్నా ఆచరణకు నోచుకోవడం లేదు. కాగితాల్లో మాత్రం సేకరించినట్లు చూపిస్తున్నారు. పైగా తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నట్లు, పొడి చెత్తను పునర్వినియోగానికి పంపిస్తున్నట్లు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో జరిగేది వేరు. 'స్వచ్ఛ సర్వేక్షణ్' పోటీల్లో భాగంగా నాణ్యత నిపుణులు పరిశీలనకు వచ్చినప్పుడు అయిదారు ఇళ్లల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నట్లు ఆర్భాటం ప్రదర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో నగరాలు, పట్టణాల్లో చెత్త నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇంటి నుంచే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలంటూ పురపాలక నిర్వహణ శాఖ తాజాగా రాష్ట్రంలోని పుర, నగరపాలికలకు ఆదేశాలు జారీ చేయడంతో పరిస్థితి మారుతుందేమో చూడాలి.

**డంపింగ్ యార్డు కొరత**

రామగుండం నగరపాలక ప్రాంతంలో నిత్యం సుమారుగా 120 మెట్రిక్ టన్నుల చెత్త ఏర్పడుతోందని అంచనా. డంపింగ్‌యార్డు లేకపోవడంతో పవిత్రమైన గోదావరి ఒడ్డునే పడేస్తున్నారు. ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా జరగక చాలా మంది చెత్తను రోడ్లపైనే పడేస్తున్నారు. వాహనాల మరమ్మతుల పేరిట కొన్ని కాలనీల్లో వారాని ఒకరోజు చెత్త సేకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. చెత్త సేకరణ కోసం మరిన్ని ఆటో ట్రాలీలను అందుబాటులోకి తేవడంతో పాటు నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తేనే రోజు ఇంటింటా చెత్త సేకరణ సాధ్యం అవుతుంది.

**అత్యాధునిక వాహనాలపై నిర్లక్ష్యం**

రామగుండంలోని గౌతమినగర్‌లోని చెత్త నిర్వహణ కేంద్రంలో కేవలం



పొడి చెత్త నిర్వహణ తప్ప తడి చెత్తను పట్టించుకోవడం లేదు. మెరుగైన చెత్త నిర్వహణ కోసం ఎన్టీపీసీలో, మల్కాపూర్, ఎన్టీఆర్‌నగర్‌లో ప్రత్యేకంగా షెడ్లు నిర్మించారు. అత్యాధునిక యంత్రాలు, వాహనాలను కొనుగోలు చేసినా ఒక్కనాడు వినియోగించలేదు. పొడి చెత్తను గుత్తేదారు కొనుగోలు చేస్తుండడంతో పారిశుద్ధ్య కార్మికులు పొడి చెత్తను వేరు చేసి విక్రయించుకొని ఆదాయం పొందుతుండగా తడి చెత్త నిర్వహణను బల్దియా పట్టించుకోవడం లేదు.

**ఆదర్శం నీరుగారింది**

ఇంట్లోనే తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయడానికి రెండు బుట్టలను సుమారు రెండు దశాబ్దాల క్రితమే రామగుండం నగరపాలికలో ఇంటింటా అందజేశారు. పారిశుద్ధ్య ఆటో ట్రాలీల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. అయినా ప్రజలు తడి, పొడి చెత్తను కలిపే వేస్తున్నారు. గతంలో ప్రయోగాత్మకంగా కొన్ని డివిజన్లలో తడి చెత్తతో వారి ఇంటి ఆవరణలోనే సేంద్రియ ఎరువు తయారు చేసుకునేలా అవగాహన కల్పించి పొడి చెత్తను మాత్రమే పునర్వినియోగానికి తరలించడం సత్ఫలితాలు ఇచ్చింది. సుమారు పాతికేళ్ల క్రితం రామగుండం పురపాలికగానున్న కాలంలో గౌతమినగర్‌లో ప్రత్యేకంగా చెత్త నిర్వహణ కేంద్రం ఏర్పాటు చేసి తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువును తయారు చేసి 'భూసంజీవని' పేరిట రైతులకు విక్రయించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పుర, నగరపాలికల అధికారులు, పాలకవర్గం ఇక్కడికి వచ్చి పరిశీలించారు. కానీ అధికారులు మారడం, వచ్చినవారు పట్టించుకోకపోవడంతో ఈ కార్యక్రమాలు నీరుగారిపోయాయి.

**ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం- సునీల్ రాథోడ్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**

ఇంటినుంచే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. మరిన్ని వాహనాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. నగరపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. చెత్త నిర్వహణను నిరంతరంగా పర్యవేక్షిస్తున్నారు. తాజాగా ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ నగరాన్ని చెత్తరహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటాం.

# అధికారి నిర్లక్ష్యం.. రైతుకు శాపం

మధిర : వ్యవసాయ శాఖలోని అధికారుల నిర్లక్ష్యం ఓ రైతుకు శాపంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఏటా ఖరీఫ్‌లో ఎవరెవరు ఎన్ని ఎకరాల్లో, ఏఏ పంటలు సాగు చేశారనే వివరాలను వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు ఆన్‌లైన్ నమోదు చేస్తుంటారు. మధిర మున్సిపాలిటీలోని జిలుగుమాడు గ్రామానికి చెందిన యన్నం కోటేశ్వరరావు పదెకరాల్లో పచ్చపెసలు సాగు చేశారు. తక్కువ పెట్టుబడితో ఎకరాకు మూడున్నర క్వింటాళ్ల చొప్పున నాణ్యమైన దిగుబడి సాధించారు.



వాటిని ఇంటికి చేర్చాక విక్రయించుకునేందుకు కావల్సిన ధ్రువీకరణ పత్రం పొందేందుకు కొద్ది రోజుల క్రితం రైతువేదిక వద్దకు వెళ్లారు. సదరు వ్యవసాయ విస్తరణాధికారి 'మీరు పెసలు సాగు చేసినట్లు ఆన్‌లైన్‌లో లేదు కదా? ధ్రువీకరణ పత్రం ఇవ్వటం కుదరద'ని తేల్చిచెప్పారు. దీంతో రైతు లబోదిబోమన్నారు. బయట మార్కెట్లో క్వింటా ధర రూ.6500 ఉంటే, మార్కెట్లో ప్రభుత్వం ధర రూ.8600... క్వింటాకు రూ.1900 వ్యత్యాసం ఉంది. భారీగా తేడా ఉండటంతో ఏం చేయాలో పాలుపోక ఇంట్లోనే నిల్వ చేశారు. వారానికోసారి రసాయన మందులు పిచికారి చేస్తూ ఉత్పత్తిని కాపాడుతున్నారు. ఈ విషయమై ఏడీఏ విజయ్‌చంద్రను వివరణ కోరగా డివిజన్‌లో కొంతమంది రైతుల సాగు వివరాలు ఇలా ఆన్‌లైన్‌లో నమోదు కాలేదన్నారు. అలాంటి వాటి విక్రయాలకు ప్రభుత్వపరంగా అగ్రికల్చర్ ప్రొడక్షన్ కమిషన్ అనుమతి ఇవ్వాల్సి ఉందని, కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు వెళ్లాయన్నారు. అనుమతి రాగానే బాధిత రైతు నుంచి కొనుగోలు చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు.

# అవగాహన లోపం.. ఆర్థిక భారం



గోదావరిఖని: ఔషధాలపై అవగాహన లోపం.. ప్రజలపై ఆర్థిక భారం పడేలా చేస్తోంది.. ఒకే రకమైన కంపోజిషన్‌తో తయారు చేస్తున్న మందుల ధరల్లో భారీ వ్యత్యాసం ఉంది. కంపెనీ ఒక్కటే ఉంటుంది. దానిపై ముద్రించే ధర కూడా ఒకటే. కాని సాధారణ మందుల దుకాణాల్లో దీన్ని ఎక్కువ ధరకు విక్రయిస్తుంటే అదే మందును జన ఔషధ దుకాణాల్లో తక్కువకు అమ్ముతుంటారు. ఈ వ్యత్యాసం తెలియక సాధారణ ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు.

జన ఔషధ దుకాణాలు, ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధ దుకాణాల్లో మందులు అతి తక్కువ ధరకు లభిస్తాయి. వీటిలో సాధారణ మందుల కన్నా రక్తపోటు, మధుమేహం లాంటి దీర్ఘకాల జబ్బులకు సంబంధించిన మందులే ఎక్కువ విక్రయాలు అవుతున్నాయని వాటి నిర్వాహకులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 4,087 సాధారణ మందుల దుకాణాలుంటే.. జన ఔషధ విక్రయ కేంద్రాలు 65 ఉండగా, ప్రధాన మంత్రి భారతీయ జన ఔషద విక్రయ కేంద్రాలు గోదావరిఖని, గంగాధర, చొప్పదండిల్లో ఉన్నాయి.

**రాసింది కొనాల్సిందే!**

ప్రతి ఆస్పత్రికి అనుబంధంగా ఔషధ దుకాణాలున్నాయి. అక్కడి వైద్యులు అందులో లభించే కంపెనీల మందులనే రాస్తారు. దీంతో రోగులు తప్పనిసరిగా అక్కడే కొనుగోలు చేయాల్సి వస్తోంది. చాలామంది వైద్యుల రాత అర్థం కాకుండా ఉంటుంది. వారు సూచించిన ఔషధ దుకాణంలోని వారే అర్థం చేసుకుని ఇస్తారు. దీంతో రోగులు ఇతర దుకాణాలకు వెళ్లడానికి సాహసించరు.

కొంతమంది వైద్యులు తమ దగ్గరికి వచ్చే రోగులకు జనరిక్ ఔషధాలు వాడొద్దని స్పష్టం చేస్తుండటమూ కొనుగోలుకు వెనకాడటానికి కారణమవుతుంది.

**ఎందుకింత తేడా?**

జనఔషధ మందుల దుకాణాలకు ఏజెన్సీలు ఎమ్మార్పీపై 60 శాతం తక్కువకు సరఫరా చేస్తాయి. దీనిపై 10 శాతం లాభం చూసుకుని వారు విక్రయిస్తారు.సాధారణ మందుల దుకాణాలకు ఏజెన్సీలు ఎమ్మార్పీపై 40 శాతం తక్కువకు సరఫరా చేస్తాయి. దీనిపై మరో 40 శాతం కలుపుకొని అమ్ముతున్నారు.సొంత ఆస్పత్రులున్న మందుల దుకాణాల నిర్వాహకులు తమ వైద్యశాలలో ఉన్న మందులనే డాక్టర్లతో రాయిస్తూ భారీ లాభంతో విక్రయిస్తున్నారు.

జనరిక్ మందులను సాధారణ దుకాణాల్లో విక్రయిస్తున్నవారు 15 నుంచి 20 శాతం రాయితీ పేరుతో ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. విషయం తెలియక రాయితీ అని చాలా మంది సాధారణ మందుల దుకాణాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. అదే మందు జనఔషధ దుకాణాల్లో తక్కువకు వస్తాయి. కానీ తెలియని జనం అటువైపు వెళ్లడం లేదు.

**ఒకేలా పనితీరు- శ్రీనివాస్, ఔషధ నియంత్రణ సహాయ సంచాలకులు, కరీంనగర్**

జనరిక్ మందులపై ప్రజల్లో అవగాహన పెరగాలి. చాలా మందికి ఈ మందుల్లో కంపోజిషన్ తక్కువగా ఉంటుందని అపోహ ఉంది. ఒకే రకమైన ఫార్ములాతో అన్ని కంపెనీలు తయారు చేస్తాయని వారు గుర్తించాలి. సాధారణ మందుల దుకాణానికి, జన ఔషధ దుకాణాల్లో లభించే మందుల పనితీరులో ఎలాంటి తేడా ఉండదు.

# నిర్ణయంలో ఆలస్యం.. అన్నదాతకు నష్టం



భగత్‌నగర్: ఆరుగాలం పంట పండించిన రైతుల్లో అధిక మంది ఏదోరకంగా నష్టపోతూనే ఉంటారు. పాలకుల ప్రణాళిక లేమి.. మిల్లర్లతో కుదరని సయోధ్య.. అధికారుల ఉదాసీనత వెరసి.. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమైంది. మరో వైపు ప్రభుత్వం ధాన్యం అక్రమదందాకు తెరదించేందుకు తెచ్చిన కొత్త పాలసీని మిల్లర్లు వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వం ఆలస్యంగా మేల్కోవడంతో జిల్లా రైతులు ఎలా నష్టపోతున్నారో వివరిస్తూ కథనం.

దసరా తర్వాత కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం తూకాలు వేయడంలో జాప్యం చేయడంతో రైతు అనేక విధాలుగా నష్టపోయాడు. మంత్రి మండలి ఉపసంఘం నెల ముందుగా తీసుకోవాల్సిన నిర్ణయాల్లో జాప్యమైంది. మంత్రి మండలి ఉపసంఘం ధాన్యం కొనుగోలు నూతన పాలసీ నిర్ణయాలను అక్టోబరు 29న జీవో రూపంలో ప్రకటించింది. ఆలస్యం అమృతం విషం అన్నట్లుగా అప్పటికే చాలామంది రైతులు ప్రైవేటుకు అమ్మేశారు. ఇంకొందరి ధాన్యం అకాల వర్షాలకు తడిసిపోయింది. 20 రోజులు జాప్యం కావడంతో అనేక ఇబ్బందులు పడ్డారు. ఉప సంఘం జీవో కోసం చూడకుండా.. ఆ సమయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలించి.. ధాన్యం తూకం వేసే ప్రక్రియ ప్రారంభిస్తే రైతులకు ఇబ్బందులు తప్పేవి.

**ప్రణాళిక అమలులో విఫలం**

జిల్లా యంత్రాంగం వానాకాలం పంట కొనుగోలు ప్రణాళికను మొదట్లోనే ఖరారు చేసుకుంది. కానీ అమలు చేయడంలో విఫలమైంది. అక్టోబరులో 91,894 మెట్రిక్ టన్నులు (23 శాతం) ధాన్యం కొనాలి. ఈ మాసంలో ఒక్క గింజ కూడా కొనలేదు. క్షేత్రస్థాయి సమస్యను తాత్కాలికంగా అధిగమించేందుకు పాలకులు ఉపశమన చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. ఆ దిశగా చర్యలు కరవు అయ్యాయి. అన్నదాత రోదన అరణ్యవేదనగా మారింది.

**బకాయిల గుదిబండా..**

రైస్‌మిల్లర్లు ఏటా తీసుకున్న ధాన్యాన్ని మర ఆడించి సకాలంలో బియ్యం అందివ్వడంలో విఫలమవుతున్నారు. కొందరు తాత్సారం చేయడతో పాటు బియ్యం పక్కదారి పట్టించారు. ఇలా జిల్లాలో సుమారు రూ.146 కోట్ల విలువైన బియ్యం ఇవ్వడంలో మిల్లర్లు విఫలమయ్యారు. రూ.కోట్లలో మిల్లర్ల బకాయిదారులుగా తేలడంతో.. దీని కట్టడికి 2022-23 వరకు మిల్లర్ల వద్ద బకాయి ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం వేలం వేసింది. శాశ్వతంగా బకాయిలు లేకుండా ఉండేందుకు వారి నుంచి పూచీకత్తు తీసుకోవాలని నిర్ణయించింది. పూచీకత్తు విధివిధానాల ఖరారుకు మంత్రి మండలి ఉపసంఘం ఏర్పాటు చేసింది.

**కొత్త విధానాన్ని వ్యతిరేకిస్తున్న మిల్లర్లు**

నూతన ధాన్యం కొనుగోలు విధానంలో మిల్లర్ల నుంచి పూచీకత్తు తీసుకోవాలని ఉంది. ధాన్యం పక్కదారిపట్టకుండా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. మిల్లర్ల చరిత్ర ఆధారంగా మూడు విభాగాలుగా విభజించింది. పూచీకత్తు అడగడంతో మిల్లర్లు గగ్గోలు పెడుతున్నారు. పదేళ్లుగా లేని పూచీకత్తు ఇప్పుడు ఇవ్వలేమంటున్నారు. గతేడాది ప్రభుత్వం మిల్లర్లు తమ భాగస్వామ్యం అమ్ముకోకుండా.. మిల్లులు విక్రయించకుండా ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తు చేశారు. మిల్లింగ్ నష్టాలపై పునఃసమీక్ష చేయాలని కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేసిన అనంతరం.. మిల్లుల కేటాయింపునకు ఇబ్బంది తలెత్తే అవకాశముంది. ప్రభుత్వం, మిల్లర్ల మధ్య సయోధ్య కుదరకపోతే రైతుకు నష్టం వాటిల్లే అవకాశముంది.

**ఎట్టకేలకు షురూ**


గంగాధర, లక్ష్మీదేవిపల్లి, మధురానగర్, నాగిరెడ్డిపూర్, నారాయణపూర్, బూర్గుపల్లి, చర్లపల్లి ఎన్, ర్యాలపల్లి, కొండాయపల్లి, వెంకటాయపల్లి, నర్సింహులపల్లి, లింగంపల్లి, గట్టుబూత్కూర్, కురిక్యాల, మల్లాపూర్ గ్రామాల్లోని కేంద్రాల్లో మంగళవారం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు ప్రారంభంలో ఆర్భాటం.. కొనడంలో ఆలస్యం', 'దసరా పాయె.. దీపావళి వచ్చే..ధాన్యం కొనరాయె', 'ధాన్యం దళారుల పాలు', 'కొనరేమి.. రైతుగోడు వినరేమి' శీర్షికలతో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. కొన్ని కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. అయితే హమాలీలు, కాంటాలు పెంచి వరి ధాన్యం కొనుగోళ్లు మరింత వేగవంతం చేయాల్సి ఉంది.

# యార్డులో స్థలం కొరత

జగిత్యాల : జగిత్యాలలోని వ్యవసాయ మార్కెట్యార్డుకు రైతులు గతకొన్ని రోజులుగా పెద్దఎత్తున ధాన్యం, మక్కలను అమ్మకానికి తెస్తున్నారు. జగిత్యాలతో పాటుగా చుట్టుపక్కల మండలాల రైతులు భారీగా దినుసులను తేవటంతో యార్డులో స్థలం సరిపోవటంలేదు. దసరా నుంచే రైతులు వరికోతలు ప్రారంభించగా దీపావళి దాటినా పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ప్యాక్స్, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం సేకరణ మొదలుగాకపోవటంతో రైతులు ప్రత్యామ్నాయ ధాన్యం విక్రయంపై దృష్టిసారించారు. చాలామంది రైతులు మిల్లుల్లో ధాన్యాన్ని విక్రయిస్తుండగా మరికొన్నిచోట్ల మధ్యవర్తులు గ్రామాల్లో రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తున్నారు. దీంతోపాటు చాలామంది రైతులు ధాన్యం, మక్కలను జగిత్యాల యార్డులకు తెచ్చి విక్రయిస్తున్నారు.

**స్థిరమైన ధర**

జగిత్యాల బీటుకు ఒక్కరోజే 712 క్వింటాళ్ల మక్కలను రైతులు విక్రయానికి తేగా క్వింటాలుకు కనిష్ఠంగా రూ.1,800 నుంచి రూ.2,502 ధర పలికింది. ప్రభుత్వ మద్దతు ధర మక్కలకు రూ.2,225 ఉండగా బీటులో సరాసరిగా 2,355 ధర పలికింది. 3,959 క్వింటాళ్ల ఎంటీయూ1010 రకం ధాన్యాన్ని అమ్మకానికి తేగా రూ.1,700 నుంచి రూ.1,925 ధర పలికింది. 247 క్వింటాళ్ల బీపీటీ ధాన్యాన్ని విక్రయించగా రూ.2,234 నుంచి రూ.2,290 ధర పలికింది. 1,872 క్వింటాళ్ల జైశ్రీరాం ధాన్యాన్ని రైతులుతేగా రూ.2,401 నుంచి రూ.2,735 చొప్పున ధర పలికింది. చాలా మంది రైతులు హార్వెస్టర్లతో నూర్పిడి చేసిన వెంటనే ట్రాక్టర్లతో పచ్చిధాన్యాన్ని నేరుగా యార్డుకు తెస్తున్నారు. నిరుడు ఆరబెట్టి తెచ్చిన జైశ్రీరాం రకం ధాన్యానికి రూ.3,300 ధర పలికింది. ఈ సీజన్‌లో సన్నధాన్యాన్ని ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించి కొనుగోలు చేస్తామనగా బోనస్‌తో కలుపుకొని



రూ.2,820 ధర చెల్లించనున్నారు. జైశ్రీరాం వంటి సూపర్‌ఫైన్ రకాలకు ఇంతకన్నా అధిక ధరలు పలికే అవకాశముందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

**ఇబ్బందుల్లేకుండా కొనుగోలు** – టి.రాజశేఖర్, మార్కెట్ కమిటీ కార్యదర్శి

అప్పుడప్పుడు ఆన్‌లైన్‌లో సమస్య తలెత్తి ఈ-నామ్ బిడ్డింగ్ వీలుగాకున్నా రాతపద్ధతిలో కొనుగోళ్లు జరుపుతూ రైతులకు ఇబ్బంది రాకుండా చూస్తున్నాము. ప్రస్తుతం పెద్దఎత్తున ధాన్యం, మక్కలు బీటుకు వస్తుండగా కొనుగోలు, తూకంవేసిన ధాన్యం బస్తాల తరలింపు ఏరోజుకారోజు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాము.

**రైతులకు భరోసా**– చిక్కుల భూమయ్య, అడ్తీ ఖరీదుదారుల సంఘం అధ్యక్షుడు

బీటులో దినుసులు విక్రయించే రైతులకు కచ్చితమైన తూకం, డబ్బుల చెల్లింపు తదితరాల భరోసా ఉంటుంది. ప్రస్తుతం మక్కలు, సన్నవడ్లకు మంచి ధరలున్నాయి. మిల్లర్లు, ఇతరప్రాంతాల వ్యాపారులు యార్డుకు వస్తున్న నాణ్యమైన సరకులను సేకరించడానికి మొగ్గు చూపుతుండటంతో ధరలు తగ్గకుండా ఉంటున్నాయి.

# సాగుబడి.. ఇప్పుడిదే ఒరవడి

వైరా : అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు చెందిన చివరి సంవత్సరం చదువుతున్న పలు జిల్లాలకు చెందిన విద్యార్థులు తమకు నిర్దేశించిన గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం (రావెప్)లో భాగంగా గ్రామాల్లోనే ఉంటూ రైతులతో మమేకవుతున్నారు. మూడేళ్లపాటు తరగతి గదుల్లో నేర్చుకున్న వ్యవసాయ పాఠాల అనుభవాలు క్షేత్రంలో ఎలా ఉంటాయో తెలుసుకునేందుకు పొలం బాట పట్టారు. కేవీకే శాస్త్రవేత్త జెస్సీ సునీత పర్యవేక్షణలో విద్యార్థులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు.

**వంద రోజులు రైతులతోనే..**

వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల పర్యవేక్షణలో వంద రోజులపాటు పూర్తిగా గ్రామాల్లోనే ఉంటూ రైతులతో పొలం బాట పట్టి తమకు తెలిసింది నేర్పిస్తూ రైతుల నుంచి ఎన్నో అనుభవాలు నేర్చుకుంటున్నారు. వ్యవసాయ కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థినులు, విద్యార్థులు ఎంపిక చేసిన గ్రామాల్లో ఉంటున్నారు. వైరా మండలం గన్నవరం, వల్లాపురం, సోమవరం, కొణిజర్ల మండలం పల్లిపాడు, తల్లాడ మండలం కుర్నవల్లి, ముదిగొండ మండలం ముదిగొండ, వెంకటాపురం, రాఘవాపురం, మేడేపల్లి, సువర్ణాపురంలో ఒక్కో చోట ఐదుగురు విద్యార్థులుంటున్నారు. ఆయా గ్రామాల్లో చైతన్యంతమైన రైతులతో మమేకమయ్యేలా కేవీకే శాస్త్రవేత్తలు దిశానిర్దేశం చేశారు. వరి, మిరప, పత్తితోపాటు ఇతర పంటల్లో ఆది నుంచి తుది వరకు యాజమాన్య పద్ధతులను వీరు పరిశీలిస్తూ సమగ్ర అధ్యయనం చేయాల్సి ఉంది. పంటకు పొలం సిద్ధం చేయడం, విత్తనాలు నాటి, మొలకెత్తడం, కాపు దశ, పంట చేతికొచ్చే తరుణం, ఆయా క్రమంలో వచ్చే చీడపీడలు ఇతర ప్రతికూలతల నుంచి వాతావరణ విపత్కర పరిస్థితులను అంచనా వేసే క్రమంలో రైతులు



ఏయే విధానాలు అవలంభిస్తారనే అంశాలను అంచనా వేయాల్సి ఉంటుంది. రైతుల అనుభవాలను జోడించుకుంటూ తరగతి గదుల్లో తమకు నేర్పిన విజ్ఞానాన్ని వారికి అందించాల్సి ఉంది. వంద రోజుల క్షేత్ర శిక్షణలో భాగంగా ప్రతి వారం వైరా కేవీకేలో సమీక్ష చేసి మరిన్ని వ్యవసాయ పద్ధతులు, అనుభవాలను మేళవింపు చేసి మరింత అవగాహన అందించే కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఆగస్టు రెండో వారంలో మొదలైన క్షేత్ర పర్యటన ఈనెలాఖరుతో ముగియనుంది.

**ఎంతో ఉపయోగం - క్రిషిక, ఖమ్మం**

ంద రోజుల పొలం బాట ఎంతో ఉపయోగపడింది. నాలుగేళ్ల చదువు పూర్తయ్యాక ఉన్నత చదువులు, ఉద్యోగాన్వేషణలో వ్యవసాయ సాగు అనుభవాలు ఎంతో ఉపయోగపడ్డాయి.

**రైతుల నుంచి తెలుసుకుంటున్నాం- నందిత, మహబూబాబాద్**

గత మూడు నెలలుగా రైతులతో మమేకవుతున్నాం. వారి నుంచి ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. గ్రామంలోనే ఉంటూ రైతులతో వ్యవసాయ సాగు పద్ధతులు నేర్చుకున్నాం. సాగు చేసే తరుణంలో రైతులు ఎదుర్కొనే ఎన్నో అంశాలపై సమగ్ర అవగాహన వచ్చింది.

**కర్షకుల ఇబ్బందులు తెలిశాయి..- కీర్తన, వరంగల్**

వంద రోజుల క్షేత్ర పర్యటనలో భాగంగా పంటల సాగులో రైతుల ఇబ్బందులను నేరుగా తెలుసుకోగలిగాం. రైతులు అవలంభిస్తున్న కొన్ని పద్దతులు వినూత్నంగా ఉండటమే కాకుండా ఎంతో నేర్చుకోగలిగే పద్ధతులు వివరించారు.

**గ్రామీణ ప్రాంతాలపై అవగాహన- అమృతవర్ష, కొత్తగూడెం**

పొలంబాటలో భాగంగా గ్రామీణ ప్రాంతాల పరిస్థితులు, రైతుల సాగు పద్ధతులతో పాటు వారి విజయగాథలపై ఎంతో అవగాహన వచ్చింది. అధునాతన విజ్ఞానంకు దీటుగా రైతులు ఎప్పటి నుంచో ఆయా సాగు మెలకువలు పాటిస్తున్నారు.

అన్నదాతలకు నేర్పించాం.ఎ.ముఖేశ్‌కుమార్, హైదరాబాద్

క్షేత్రంలో రైతుల నుంచి ఎన్నో అనుభవాలను నేర్చుకోవడమే కాకుండా వారికి ఎంతో నేర్పించాం. రసాయన ఎరువుల వినియోగం అధికమైతే ఎలాంటి ఇబ్బందులు వస్తాయో చెప్పి సేంద్రీయ ఎరువుల వినియోగంపై అవగాహన పెంచాం.

# సహకారం.. ఉపకారం

ఖమ్మం : బంగారం తాకట్టు రుణాల్లో ఖమ్మం డీసీసీబీ(జిల్లా కేంద్ర సహకార బ్యాంకు) ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో మొత్తం 9 డీసీసీబీలు ఉన్నాయి. ఇప్పటి వరకు కరీంనగర్ జిల్లా మొదటి స్థానంలో ఉండగా దాన్ని అధిగమించి ఖమ్మం ముందుకు సాగటం విశేషం. ఈ బ్యాంకులో రైతులతో పాటు వివిధ వర్గాలకు చెందిన ఖాతాదారులున్నారు. కొన్ని నెలల నుంచి బంగారం తాకట్టు రుణాలపై బ్యాంకు విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. కేవలం పది నిమిషాల్లోనే రుణం మంజూరు చేస్తామని ప్రకటించి దాన్ని పక్కాగా అమలు చేసింది. దీంతో డీసీసీబీ పరిధిలోని శాఖల్లో అనేక మంది ఈ రుణాలు తీసుకునేందుకు ఆసక్తి చూపారు. నిబంధనలు



సరళతరంగా ఉండటం, వెళ్లిన వెంటనే జాప్యం లేకుండా మంజూరు చేయటం, బకాయిలు చెల్లించిన వెంటనే ఆభరణాలను విడుదల చేయటం వల్ల రుణాలు తీసుకునే వారి సంఖ్య పెరిగింది. కొంతకాలం నుంచి వరుస ఘటనలతో అట్టుడుకుతున్న బ్యాంకుకు రాష్ట్రంలో ప్రథమ స్థానం రావటం ఒక విధంగా ఊరటగానే చెప్పవచ్చు. బ్యాంకులో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది సమష్టి కృషి వల్లనే ఇది సాధ్యమైందని డీసీసీబీ ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, సీఈఓ వసంతరావు తెలిపారు.

ఇదీ ప్రత్యేకత....బంగారు ఆభరణాల తాకట్టుపై రూ.25 లక్షల వరకు తక్షణ రుణ సదుపాయం, ఎక్స్‌ప్రెస్ గోల్డ్‌లోన్‌కు గ్రాముకు రూ.5,200, సాధారణ బంగారు రుణానికి గ్రాముకు రూ.5,000, కేవలం 10 నిమిషాల్లోనే రుణం మంజూరు



# పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడులను స్వాగతిస్తున్నాం: సీఎం చంద్రబాబు

అమరావతి: ఎస్ఏఈఎల్, నార్ఫండ్, ఎన్డీబీ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయ్యారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా రాష్ట్రంలో పెట్టుబడులపై వారు చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడులను స్వాగతిస్తున్నామన్నారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తికి ఎస్ఏఈఎల్ అనుసరిస్తోన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించిందన్నారు. వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి రైతుల ఆదాయాన్ని పెంచే ఈ తరహా ప్రాజెక్టులను ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయడానికి పూర్తి సహకారం అందించే దిశగా తమ చర్చలు సాగాయని సీఎం అన్నారు. ఏపీలో ఎస్ఏఈఎల్ రెండు దశల్లో 1200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి పెట్టుబడులు పెట్టనుందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు ఉన్న అన్ని అనువైన పరిస్థితులపై చర్చించామన్నారు.

# వైకాపా నాటకాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు: చంద్రబాబు



అమరావతి: జమిలి అమల్లోకి వచ్చినా.. ఎన్నికలు జరిగేది 2029లోనే అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. మీడియాతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. "ఒకే దేశం, ఒకే ఎన్నిక విధానానికి ఇప్పటికే మా మద్దతు ప్రకటించాం. వైకాపా పబ్బం గడుపుకోవడానికి ఏదిపడితే అది మాట్లాడుతోంది. ఆ పార్టీ నేతలు ప్రజల్లో ఎప్పుడో విశ్వసనీయత కోల్పోయారు. వైకాపా చేసే నాటకాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం కొనసాగుతోంది. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్‌ను ప్రజల్లోకి మరింత తీసుకెళ్లాలి. వర్సిటీలు, కళాశాలలు, పాఠశాలలతో పాటు ప్రతి చోటా చర్చ జరగాలి. విజన్ 2020 సాకారమైన తీరు నేటి తరం తెలుసుకోవాలి. గత పరిస్థితులను బేరీజు వేస్తే విప్లవాత్మక మార్పులు అందరికి కనిపిస్తున్నాయి. 2047లోనూ ఇదే పునరావృతం అవుతుంది. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ ఒకరోజు పెట్టి వదిలేసేది కాదు. భవిష్యత్తు తరాల బాగు కోసం చేసే ప్రయత్నంలో అందరి భాగస్వామ్యం కావాలి. రేపటి తరం భవిష్యత్తు కోసమే విజన్ 2047. సాగునీటి సంఘాలు, సహకార, ఇతరత్రా ఎన్నికలు షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయి. ఈసారి కలెక్టర్ల సదస్సులో ఎన్నో మార్పులు తీసుకొస్తాం. సుదీర్ఘ సమీక్షలకు తావివ్వకుండా ప్రశ్నలు–సమాధానాల రూపంలో నిర్వహిస్తాం. ముందుగానే కలెక్టర్లు, ఎస్పీలకు చర్చ అంశాలు పంపి సమాధానాలు కోరతాం. దీంతో సమయం సద్వినియోగం కావడంతో పాటు మంత్రులు–అధికారుల మధ్య సమన్వయం పెరుగుతుంది. ఆసుపత్రిలో చేరిన భాజపా అగ్రనేత ఎల్‌కే ఆద్వాణీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా. ఆద్వాణీతో నాకు దశాబ్దాలుగా అనుబంధం ఉంది. ఆనాడు ఏపీ అభివృద్ధిలో ఆయన సహకారం మరువలేనిది" అని చంద్రబాబు తెలిపారు.




అమరావతి: సభ్యత్వ నమోదులో తెదేపా సరికొత్త రికార్డు సృష్టించిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఈ సంఖ్య 73 లక్షలకు చేరుకుందని చెప్పారు. పార్టీ కార్యాలయంలో తెదేపా సభ్యత్వ నమోదుపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు.

క్యాడర్, పార్టీ నాయకులకు అభినందనలు తెలిపారు. టాప్ 5లో రాజంపేట, నెల్లూరు, కుప్పం, పాలకొల్లు, మంగళగిరి నియోజకవర్గాలున్నాయని చెప్పారు. నూతన సభ్యత్వాలకు తోడు పెద్ద సంఖ్యలో యువత, మహిళల సభ్యత్వాలు నమోదయ్యాయని పేర్కొన్నారు. క్యాడర్ సంక్షేమంతో పాటు అందరి ఎదుగుదలకు ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు చెప్పారు. "పనితీరు ఆధారంగా గుర్తింపు ఉంటుంది. పదవులు తప్ప ఊరికే పార్టీలో ఉన్నామంటే కుదరదు. ప్రజలు, పార్టీకి సేవ చేయకుండా పదవులు ఇమ్మనడం సరికాదు. కష్టపడనిదే ఏదీ రాదనే విషయం ప్రతిఒక్కరూ గ్రహించాలి. కొందరు పదవులు వచ్చేశాయని పార్టీని నిర్లక్ష్యం చేస్తున్నారు. మరికొందరు ఎమ్మెల్యేలు అయ్యామని నిర్లక్ష్యం వహిస్తున్నారు.

పార్టీ వల్లే ఏ పదవైనా అని గ్రహించి ప్రవర్తించాలి. పార్టీని బలోపేతం చేస్తూ ప్రజలకు సేవ చేస్తేనే రాజకీయాల్లో కొనసాగుతారు" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గోపీ మూర్తి ప్రమాణ స్వీకారం



అమరావతి, డిసెంబర్ 14: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బొర్రా గోపీ మూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా గోపీ మూర్తి విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వెలగపూడిలోని రాష్ట్ర అసెంబ్లీ భవన ప్రాంగణంలో శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ఆధ్వర్యంలో ఈరోజు (శనివారం) ఎమ్మెల్సీగా గోపీ ప్రమాణం చేశారు. అనంతరం బొర్రా గోపీమూర్తికి మండలి తరపున ఛైర్మన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆపై శాసన మండలికి సంబంధించిన నియమ, నిబంధనలు, కార్యకలాపాల పత్రాలను ఎమ్మెల్సీకి ఛైర్మన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) ఎమ్మెల్సీలు కె.ఎస్. లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్, ఉపాధ్యాయులు, నూతన ఎమ్మెల్సీ కుటుంబ సభ్యులు, అసెంబ్లీ సిబ్బంది హాజరయ్యారు.

**స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలోకి దిగి...** ఈనెల 5న జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా గోపీ మూర్తి బరిలో నిలిచి విజయం సాధించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు సంబంధించి గతంలో షేక్ షాబ్జి ఎమ్మెల్సీ ఉపాధ్యాయ కోటాలో ఉన్నారు. ఎమ్మెల్సీగా 2021 మార్చి 17న గెలిచిన షేక్ సాబ్జీ.. గతేడాది డిసెంబర్ 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఈ ఉపఎన్నిక అనివార్యమైంది. డిసెంబర్ 5న ఎన్నికల జరుగగా..డిసెంబర్ 9న కౌంటింగ్ జరిగింది. కాకినాడ, తూర్పుగోదావరి, బీఆర్ అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలతో కూడిన ఈ నియోజకవర్గంలో మొత్తం 16,737 మంది ఓటర్లు ఉండగా.. 15,494 ఓట్లు పోలయ్యాయి.

గోపీమూర్తి 9,165 ఓట్లు సాధించగా.. ఎస్‌టీయూకు చెందిన స్వతంత్ర అభ్యర్థి గంధం నారాయణరావుకు 5,259 ఓట్లు దక్కాయి. దీంతో గోపీ మూర్తి 3906 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. అలాగే స్వతంత్రులుగా బరిలోకి దిగిన మరో ముగ్గురు అభ్యర్థుల్లో పులుగు దీపికకు 102 ఓట్లు, నామన వెంకటలక్ష్మికి 81, డాక్టర్ కవల నాగేశ్వరరావుకు 73 ఓట్లు దక్కాయి. 814 ఓట్లు చెల్లుబాటు కాలేదు. అయితే కాకినాడ జేఎన్‌టీయూలో కౌంటింగ్ ప్రారంభవగా.. తొలి ప్రాధాన్యత ఓటులోనే ఫలితం తేలిపోయింది. పోలైన 15490 ఓట్లలో మూర్తికి 8,929 తొలి ప్రాధాన్యతా ఓట్లు లభించాయి. ప్రతి టేబుల్‌లో వెయ్యి ఓట్లకు 600 పైగా ఓట్లు గోపి మూర్తికే దక్కాయి.

# ముగిసిన విజయ్‌పాల్ కస్టడి.. పోలీసుల ప్రశ్నలకు దొరకని సమాధానాలు?



ఒంగోలు: నాటి వైకాపా ఎంపీ రఘురామకృష్ణరాజుపై 2021లో సీఐడీ కార్యాలయంలో చోటుచేసుకున్న దాడి కేసులో అరెస్టై రిమాండ్‌లో ఉన్న విశ్రాంత అదనపు ఎస్పీ విజయ్‌పాల్‌ను ప్రకాశం పోలీసులు రెండు రోజుల కస్టడీకి తీసుకుని విచారించారు. రెండో రోజు.. శనివారం ఉదయం నుంచి ప్రశ్నించిన పోలీసులు విచారణ అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. సాయంత్రం గుంటూరులోని ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచి తిరిగి జైలుకు తరలించనున్నారు. రఘురామకృష్ణరాజు కస్టడీలో ఉన్నప్పుడు కొట్టిందెవరనే దానిపైనే ప్రధానంగా ప్రశ్నించినట్టు తెలుస్తోంది. దర్యాప్తు అధికారి, ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో పోలీసు బృందం 50 ప్రశ్నలు సంధించింది. అన్ని ప్రశ్నలకు అరకొరగా సమాధానం చెప్పిన విజయ్‌పాల్.. చాలా వరకు తెలియదు, గుర్తు లేదు అని సమాధానమిచ్చినట్టు తెలుస్తోంది. రఘురామను కొట్టిన నలుగురు వ్యక్తుల వివరాలను విజయ్‌పాల్ నుంచి రాబట్టలేకపోయినట్టు తెలుస్తోంది.




# ఆ ఘటనలో నా ప్రమేయం లేదు.. బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తా: అల్లు అర్జున్

హైదరాబాద్: క్లిష్ట సమయంలో తనకు మద్దతుగా నిలిచిన వారందరికీ నటుడు అల్లు అర్జున్ కృతజ్ఞతలు చెప్పారు. చంచల్‌గూడ జైలు నుంచి విడుదలైన అనంతరం ఆయన తన నివాసంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. "దేశవ్యాప్తంగా నాకు మద్దతు ఇచ్చిన వారందరికీ ధన్యవాదాలు. మీ ప్రేమాభిమానాలతో నా హృదయం నిండింది. నాపై అపరిమితమైన ప్రేమ చూపించిన నా అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు" అని అల్లు అర్జున్ అన్నారు. సంధ్య థియేటర్ వద్ద చోటుచేసుకున్న ఘటన గురించి మాట్లాడుతూ.."దురదృష్టకర ఘటన. ఆ కుటుంబానికి జరిగిన దానికి నేను ఎంతగానో చింతిస్తున్నా. అన్ని విధాలుగా అండగా ఉంటా. ఉద్దేశపూర్వకంగా జరిగిన ఘటన కాదు. ప్రమాదవశాత్తూ జరిగింది. అనుకోకుండా జరిగిన ఈ ఘటనలో నా ప్రమేయం లేదు. కుటుంబంతో కలిసి నేను థియేటర్‌లో సినిమా చూస్తున్నప్పుడు ఇది చోటుచేసుకుంది. సుమారు 20 ఏళ్ల నుంచి ఆ థియేటర్‌కు నేను వెళ్తున్నా. దాదాపు 30 సార్లు అక్కడ సినిమా చూశా. గతంలో ఎప్పుడూ ఇలాంటి ఘటన జరగలేదు. త్వరలోనే ఆమె కుటుంబాన్ని కలుస్తా. ప్రస్తుతం కేసు కోర్టులో ఉంది. దీని గురించి మాట్లాడాలనుకోవడం లేదు" అని అన్నారు. అల్లు అర్జున్ తండ్రి అల్లు అరవింద్ కూడా మీడియాతో మాట్లాడారు. ఈసందర్భంగా జాతీయ, స్థానిక మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు.

**అసలేం జరిగిందంటే..:** అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ తెరకెక్కించిన చిత్రం 'పుష్ప 2 ది రూల్'. డిసెంబర్ 5న ఇది ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. ప్రేక్షకుల ఆదరణను దృష్టిలోఉంచుకుని డిసెంబర్ 4న ఈ సినిమా ప్రీమియర్ షోలు పలుచోట్ల ప్రదర్శించారు. హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌లో ప్రదర్శించిన 'పుష్ప 2' బెనిఫిట్ షోకు అల్లు అర్జున్, తన కుటుంబసభ్యులతో హాజరయ్యారు. ఆయన్ని చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో పోటీపడ్డారు. దీంతో తొక్కిసలాట చోటుచేసుకొని రేవతి అనే మహిళ మృతి చెందింది. ఆమె తనయుడు శ్రీతేజకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు థియేటర్‌కు సంబంధించిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఏ11గా అల్లు అర్జున్‌ను పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన్ని అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరుచేయడంతో శనివారం ఉదయం ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. జైలు నుంచి ఇంటికి చేరుకున్న అల్లు అర్జున్‌ను తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన దర్శక – నిర్మాతలు, హీరోలు కలిశారు. తొక్కిసలాట ఘటన, అరెస్ట్, తాజా పరిణామాల గురించి చర్చించారు.




హైదరాబాద్: రాజధాని ప్రాంతంలో మరో రూ.20వేల కోట్లతో అభివృద్ధి పనులకు సోమవారం జరిగే అథారిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి నారాయణ తెలిపారు. రాజధాని ప్రాంతంలోని సీడ్ క్యాపిటల్ నుంచి జాతీయ రహదారికి అనుసంధానం కానున్న E11, E13, E15 రోడ్లను మంత్రి నారాయణ పరిశీలించారు. మొత్తం 20,017 చదరపు కిలోమీటర్ల పరిధిలో తూర్పు నుంచి పశ్చిమకు 16 రోడ్లు, ఉత్తరం నుంచి దక్షిణం వరకు 18 రోడ్లు వస్తున్నాయని మంత్రి చెప్పారు. గంటకు 80 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో వెళ్లేలా ఈ రోడ్లను నిర్మిస్తున్నామన్నారు.

రాబోయే 30 సంవత్సరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపడుతున్నట్లు నారాయణ వెల్లడించారు. రహదారి నిర్మాణాలతో ఇళ్లు కోల్పోతున్నవారు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

# వ్యవసాయ శాఖపై శ్వేతపత్రం విడుదలకు మేం సిద్ధం.. జగన్ సిద్ధమా..? : సోమిరెడ్డి



అమరావతి: వ్యవసాయ శాఖను జగన్ నిర్వీర్యం చేసి.. రైతులకు ప్రోత్సాహకాలు దూరం చేశారని తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. ప్యాలెస్‌లో గోళ్లు గిల్లుకుంటూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ఏనాడైనా ఆయన వ్యవసాయ శాఖపై సమీక్ష నిర్వహించారా అని ప్రశ్నించారు. జగన్‌కు రైతు అనే మాట ఉచ్ఛరించే అర్హత లేదన్నారు.

రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రాన్ని తొలిస్థానానికి తీసుకెళ్లిన ఘనత ఆయనదే అని ఎద్దేవా చేశారు. వైకాపా హయాంలో వ్యవసాయ రంగం చాలా నష్టపోయిందని మండిపడ్డారు. స్వర్ణాంధ్ర విజన్ - 2047 డాక్యుమెంట్‌లో వ్యవసాయానికి పెద్దపీట వేశారని గుర్తుచేశారు. రేషన్ బియ్యం విదేశాలకు పంపి జగన్ రూ. కోట్లు దండుకున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో వ్య వసాయ రంగం ఎంత నష్టపోయిందో పులివెందుల రైతులే చెప్తారని అన్నారు. వ్యవసాయ శాఖపై శ్వేతపత్రం విడుదలకు తాము సిద్ధం, వైకాపా సిద్ధమా అని సవాల్ చేశారు. దేశంలో రైతులపై తలసరి సగటు అప్పు రూ.74,500 ఉంటే ఏపీలో మాత్రం రూ.2.45లక్షలు ఉండటానికి కారణం జగన్ కాదా అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు.

# ఆ లెక్కలపై తేల్చుకుందాం రండి.. వైసీపీ నేతలకు మంత్రి నాదెండ్ల మనోహర్ సవాల్



అమరావతి: కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరిస్తూ.. అండగా ఉంటుందని ఏపీ పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వైసీపీ నేతలపై ట్విట్టర్(ఎక్స్) వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు రైతులకు భరోసాగా నిలుస్తున్నారో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. వైసీపీ పాలనలో గత ఖరీఫ్ సీజన్లో డిసెంబర్ 13నాటికి– 9,40,936 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరణ చేసిందని.. కూటమి ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్లో ఇప్పటి వరకూ 16,34,151 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించిందని వివరించారు. కలెక్టరేట్ల దగ్గరకు బస్తాలు మోసుకువెళ్లి వైసీపీ నేతలు ఫొటోషూట్ చేశారని విమర్శించారు. గత సీజన్లో గుంటూరు, విశాఖపట్నం, అనకాపల్లి, అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో కనీసం సేకరణ ఎందుకు చేపట్టలేదని అన్నారు. కాగా.. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ధాన్యం కొనుగోలులో అనేక సంస్కరణలు తీసుకువచ్చినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రైతులకు బకాయిలు చెల్లించకుండా వారిని మోసం చేసిందని ఆయన ఆగ్రహించారు. గత ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను సైతం చంద్రబాబు సర్కారే చెల్లించినట్లు మంత్రి నాదెండ్ల వెల్లడించారు. ఈ ఏడాది సంక్రాంతి రాకముందే రైతులు కళ్లల్లో ఆనందం కనపడుతోందని మంత్రి చెప్పారు. రైతులకు అండగా నిలబడకపోతే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్షల కోట్ల బడ్జెట్ వృథాగా మారుతుందన్నారు. అందుకే వారిని ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎప్పుడూ రైతుల గురించే ఆలోచిస్తారని తెలిపారు. వారికి మంచి చేయాలనే ఉద్దేశంతో నిరంతరం కష్టపడుతున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కంటే కూటమి ప్రభుత్వంలో ధాన్యం దిగుబడి అధికంగాఉందన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తే ఎక్కువ మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందన్నారు. ధాన్యం అమ్మకాల్లో రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని చెప్పారు. అలా ఆందోళన చెంది దళారులకు తక్కువ ధరకే విక్రయించవద్దని అన్నారు. రైతులకు కనీస మద్దతు ధర దక్కాల్సిందేనని అన్నారు. అందుకు ప్రభుత్వం అన్నీ చర్యలు చేపట్టిందని... ధాన్యంలో తేమ 20 శాతం వరకు ఉన్నా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. వర్షం వస్తే ధాన్యం తడిసిపోకుండా రైతులకు అందించేందుకు టార్పాన్లు సైతం మొదటిసారి అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. మిల్లర్లకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించామని అన్నారు. కాబట్టి వారంతా రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. రైతులను ఇబ్బంది పెట్టినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు.


# మోహన్‌బాబును విచారిస్తోన్న పోలీసులు

హైదరాబాద్, డిసెంబర్ 14: కలెక్షన్ కింగ్ మోహన్ బాబును పహడి షరీఫ్ పోలీసులు విచారిస్తున్నారు. అయితే తాను ప్రస్తుతం అనారోగ్యంతో ఉన్నానని.. కొద్దిగా కోలుకున్న అనంతరం విచారణ చేయాలని పోలీసులను మోహన్ బాబు కోరారు. అందుకు వారు నిరాకరించారు. తమ విచారణకు సహకరించాలంటూ మోహన్ బాబును వారు కోరారు. దీంతో పోలీసుల సూచనను మోహన్ బాబు అంగీకరించారు. ఇక గన్ ఇవ్వాలంటూ మోహన్ బాబును పోలీసులు కోరారు. ఈ రోజు సాయంత్రం గన్ ప్రొడ్యూస్ చేస్తానంటూ పోలీసులకు మోహన్ బాబు హామీ ఇచ్చారు. మరోవైపు పోలీసుల విచారణకు హాజరుకాకుండా.. మోహన్ బాబు అజ్ఞాతంలోకి వెళ్లారంటూ ఓ ప్రచారం అయితే ఊపందుకొంది. దీనిపై మోహన్ బాబు.. తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. తాను ఎక్కడికి పారిపోలేదని స్పష్టం చేశారు. అస్వస్థత కారణంగా తన నివాసంలోనే చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. తనపై అసత్య ప్రచారం జరుగుతుందంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్స్ ఖాతా వేదికగా మోహన్ బాబు స్పందించిన కొన్ని గంటలకే ఆయన్ని పోలీసులు విచారిస్తుండడం గమనార్హం. ఇంకోవైపు.. మంచు ఫ్యామిలీలో ఇటీవల ఘర్షణ వాతావరణం నెలకొంది. ఆ క్రమంలో మంచు మోహన్ బాబు, మంచు మనోజ్ మధ్య ఏదో జరుగుతుందంటూ ప్రచారం జరిగింది. దీంతో శంషాబాద్ మండలంలోని జల్‌పల్లిలో మోహన్ బాబు నివాసంలోకి మంచు మనోజ్ బలవంతంగా వెళ్లారు. ఆ తర్వాత మోహన్ బాబు ఆడియో క్లిప్ విడుదల చేశారు. అదే సమయంలో మోహన్ బాబు పెద్ద కుమారుడు మంచు విష్ణు.. విదేశాల నుంచి హైదరాబాద్ వచ్చారు. ఇంతలో విలేకర్ల సమావేశంలో మంచు మోహన్ బాబు సీరియస్ అయ్యారు. ఆ క్రమంలో ఓ మీడియా ఛానెల్ జర్నలిస్ట్‌పై ఆయన దాడి చేశారు. ఈ ఘటనపై జర్నలిస్ట్‌లు నిరసన బాట చేపట్టారు.




## అనసూయ.. చీరలో హంసలాంటి అందం..

తెలుగు టెలివిజన్ ప్రపంచంలో తనదైన శైలితో ప్రేక్షకులను ఆకర్షించిన అనసూయ భరద్వాజ్, తన గ్లామర్‌తో పాటు సాంప్రదాయ లుక్స్‌లోనూ అందాన్ని హైలెట్ చేస్తూ నిత్యం ట్రెండ్ సెట్ చేస్తుంది. తాజాగా షేర్ చేసిన శారీ ఫోటోస్ లో ఆమె ఫ్యాషన్ సెన్స్‌ను మరింతగా ఎలివేట్ చేశాయి. పట్టు చీరలో పింక్ బ్లౌజ్, వెండి నెక్లెస్, సంప్రదాయ ఆభరణాలతో ఆమె మరింత అందంగా మెరిసింది. అనసూయ ధరించిన శారీలోని ప్రతీ ఎలిమెంట్ ఆమె వ్యక్తిత్వాన్ని హైలైట్ చేసింది. ఆమె హెయిర్‌స్టైల్‌తో పాటు మేకప్ సింపుల్‌గా ఉండటం వల్ల లుక్ మరింత క్లాసీగా కనిపించింది. ముఖ్యంగా ఆమె ధరించిన బ్లౌజ్ డిజైన్ వినూత్నంగా ఉండటం విశేషం. ఈ ఫోటోలకు అనసూయ ఇచ్చిన క్యాప్షన్ "హంస అందం" అంటూ తన అభిమానులను విశేషంగా ఆకర్షించింది. అనసూయ కెరీర్ గురించి మాట్లాడితే, టెలివిజన్ షోస్



నుంచి సినిమాల వరకు తనదైన గుర్తింపు సంపాదించింది. పుష్పలో దక్షాయణి పాత్రతోనే కాకుండా అనేక చిత్రాల్లో ఆమె చేసిన క్యారెక్టర్స్ ఆడియన్స్‌ను మెప్పించాయి. ప్రస్తుతానికి అనసూయ పలు క్రేజీ ప్రాజెక్టులలో భాగస్వామ్యమై ఉంది. ముఖ్యంగా పుష్ప 2లో ఆమె కనిపించింది కొన్ని సీన్స్ లోనే అయినప్పటికీ ఎంతగానో ఆకట్టుకుంది. ఇలాంటి రోల్స్ లో కూడా అనసూయకి పోటీ ఎవరు రారేమో అని చెప్పవచ్చు. ఈ ఫోటోలను చూసిన నెటిజన్లు అనసూయ ఫ్యాషన్ సెన్స్‌ను కొనియాడుతూ కామెంట్స్ చేస్తున్నారు. ఆమె ఎప్పటికప్పుడు తన ఫ్యాషన్ ట్రెండ్‌లతో అభిమానులను ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుండటం ఆమె ప్రత్యేకత. ఆమె తన ఫోటోషూట్‌ల ద్వారా యువతకు ఫ్యాషన్ స్ఫూర్తిగా నిలుస్తూ, మరింత ప్రశంసలు అందుకుంటోంది. ఇక ప్రస్తుతం కూడా అనసూయ పలు బిన్నమైన సినిమాలతో బిజీగా మారింది. అలాగే తమిళ్ హిందీ భాషల్లో కూడా ఆమె అవకాశాలు వస్తున్నట్లు టాక్.

## కీర్తి సురేష్ వెడ్డింగ్ బెల్స్.. సందడి మాములుగా లేదు

సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ తన చిన్న నాటి స్నేహితుడు, ప్రియుడు ఆంటోనీ తటిల్ తో ఏడడుగులు వేయబోతోంది. గోవాలో వీరి వివాహం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య గ్రాండ్ గా జరగబోతోంది. ఈ వివాహ వేడుకకి వచ్చే అతిథుల కోసం ఈ జంట ప్రత్యేక ఏర్పాట్లు చాలా చేసారంట. ఎంటర్టైన్మెంట్ తో పాటు, వినోదం అందించే విధంగా వారిద్దరికి సంబంధించిన వెడ్డింగ్ గ్రీటింగ్స్, ఫజిల్స్ తో ప్రత్యేకంగా అలంకరించారంట. వీటికి సంబంధించిన ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వీరి పెళ్లి కేరళ హిందూ సంప్రదాయంతో పాటు, క్రిస్టియన్ స్టైల్ లో రెండు సార్లు జరగబోతోంది. గురువారం ఉదయం వివాహ వేడుక ముహూర్తం నిర్ణయించారంట. కీర్తి సురేష్, ఆంటోనీ తటిల్ కలిసి దిగిన ఫోటోలని స్పెషల్ గిఫ్ట్ కార్డ్స్ గా డిజైన్ చేశారు. కేరళ సంప్రదాయ శైలిలో ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ ని నిర్వహించారు. ఇందులో వారిద్దరి ఇష్టాలని రిప్రజెంట్ చేసే విధంగా గిఫ్ట్స్, బ్యాండ్ లు ఏర్పాటు చేశారు. ఈ



నైట్ కి ప్రీ వెడ్డింగ్ పార్టీ ఉండబోతోందంట. దీని తర్వాత పెళ్లి తంతు మొదలవుతుందని తెలుస్తోంది. ఆంటోనీ తటిల్ కి వ్యాపారాలు ఉన్నాయి. ఇద్దరు చిన్నప్పటి నుంచి కలిసి చదువుకున్నారు. కాలేజీ డేస్ నుంచి ప్రేమలో ఉన్నారు. 15 ఏళ్ళ వీరి రిలేషన్ ని నెక్స్ట్ లెవల్ కి ఇప్పుడు తీసుకొని వెళ్తున్నారు. కీర్తి సురేష్ నటించిన హిందీ మూవీ 'బేబీ జాన్' డిసెంబర్ 20న థియేటర్స్ లోకి రాబోతోంది. ఈ సినిమాపై అమ్మడు చాలా హోప్స్ పెట్టుకుంది. పెళ్లి తర్వాత మూవీ ప్రమోషన్స్ లో పాల్గొనే అవకాశం ఉంది. అలాగే తమిళంలో చేసిన 'రివాల్వర్ రీటా' కూడా రిలీజ్ కి సిద్ధమవుతోంది. దాంతో పాటు మరో రెండు సినిమాలు షూటింగ్ కంప్లీట్ చేసినట్లు తెలుస్తోంది. తెలుగులో కూడా ఓ కొత్త సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనే మాట వినిపిస్తోంది. చివరిగా కీర్తి సురేష్ దసరా సినిమాతో తెలుగులో బ్లాక్ బస్టర్ అందుకుంది. ఈ సినిమా తర్వాత తమిళ్, హిందీ ప్రాజెక్ట్స్ ఉండటంతో తెలుగులో కొత్త సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. పెళ్లి తర్వాత ఆమె స్టోరీస్ సెలక్షన్స్ ఎలా ఉంటాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## డాకు మహారాజ్ ఫస్ట్ సింగిల్.. బాలయ్య ఊచకోతే!



టాలీవుడ్ సీనియర్ హీరో బాలకృష్ణ వరుస హిట్స్ తో దూసుకెళ్తున్న విషయం తెలిసిందే. ఆరు పదుల వయసులో కూడా యంగ్ హీరోలతో పోటీ మరీ సినిమాలు చేస్తున్నారు. ప్రస్తుతం డాకు మహారాజ్ మూవీతో బిజీగా ఉన్నారు. హై యాక్షన్ ఎంటర్టైనర్ గా రూపొందుతున్న ఆ సినిమాకు బాబీ కొల్లి దర్శకత్వం వహిస్తున్నారు. నెవ్వర్ బిఫోర్ అనేలా బాలయ్యను మాస్ లుక్ లో చూపిస్తానని ఆయన పలుమార్లు తెలిపారు. అందుకు తగ్గట్టుగానే మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్స్, గ్లింప్స్ ఉన్నాయి. వేరే లెవెల్ లో ఆకట్టుకున్నాయి. సినిమాపై మంచి అంచనాలు పెంచాయి. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12వ తేదీన డాకు మహారాజ్ ను రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. ఆ తర్వాత ప్రమోషన్స్ లో స్పీడ్ పెంచారు. వరల్డ్ వైడ్ గా భారీ ఎత్తున ప్రమోషన్స్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అయితే బాలయ్య అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఫస్ట్ సింగిల్ అప్డేట్ ను రీసెంట్ గా మేకర్స్ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రోమోను శుక్రవారం రిలీజ్ చేస్తామని ముందే చెప్పినట్లు విడుదల చేశారు. అదిరిపోయే పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. అందులో బాలయ్య పవర్ ఫుల్ లుక్ లో కనిపిస్తున్నారు. గొడ్డలి పట్టుకుని ఊచకోత కోసం గుర్రంపై వెళ్తున్నట్లు ఉన్నారు. దేగ దేగ దోఖో.. అంటూ సాగుతున్న డాకు మహారాజ్ ఫస్ట్ సింగిల్ ప్రోమో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మంచి వ్యూస్ అందుకుని దూసుకుపోతోంది. గూస్ బంప్స్ తెప్పిస్తోందనే చెప్పాలి. విజువల్స్ క్రేజీగా ఉండి ఆకట్టుకుంటున్నాయి. బాలయ్య ఊచకోత తప్పదనేలా అనిపిస్తోందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ప్రోమో అదిరిపోయిందని, సాంగ్ పై అంచనాలు పెరుగుతున్నాయని అంటున్నారు. అయితే ఫస్ట్ సింగిల్ కు అనంత్ శ్రీరామ్ లిరిక్స్ అందించారు. నకాష్ అజీజ్ పాడారు. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్... వేరే లెవెల్ లో ఉంది. సాంగ్ ఛార్ట్ బస్టర్ గా నిలిచేలా కనిపిస్తోంది. మొత్తానికి ఫస్ట్ సింగిల్ కోసం వెయిట్ చేస్తున్నట్లు అంతా చెబుతున్నారు. ఇక సినిమా విషయానికొస్తే.. డాకు మహారాజ్ మూవీలో శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. బాబీ డియోల్, చాందిని చౌదరి కీలక పాత్రలు పోషిస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. మరి డాకు మహారాజ్ మూవీ ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

## మెహరీన్.. ఎన్నాళ్ళకి మళ్ళీ ఇలా..



'కృష్ణగాడి వీరప్రేమగాథ' సినిమాతో 2016లో టాలీవుడ్ లోకి హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన అందాల భామ మెహరీన్ పిర్జాదా. ఈ పంజాబీ ముద్దుగుమ్మ మొదటి చిత్రంతోనే సక్సెస్ అందుకోవడంతో బ్యాక్ టూ బ్యాక్ ఆఫర్స్ అందుకుంది. తరువాత 'ఫిల్లౌరి' సినిమాతో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా పర్వాలేదనే టాక్ తెచ్చుకుంది. తరువాత తెలుగులో శర్వానంద్ కి జోడీగా 'మహానుభావుడు' మూవీ చేసింది. ఈ సినిమా సక్సెస్ అయ్యింది. 'రాజా ది గ్రేట్' సినిమాలో రవితేజతో జతకట్టి బ్లాక్ బస్టర్ అందుకుంది. ఇలా వరుస విజయాలు రావడంతో మెహరీన్ క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. తెలుగు, తమిళ్, పంజాబీ భాషలలో వరుసగా మూవీస్ చేసింది. అయితే తెలుగులోనే ఆమె ఎక్కువ అవకాశాలు అందుకుంది. అయితే తరువాత ఆమెకి ఆశించిన స్థాయిలో సక్సెస్ లు రాలేదు. 'ఎఫ్ 3'తో ఆమె చివరిగా హిట్ అందుకుంది. గత ఏడాది 'స్పార్క్' అనే మూవీలో కొత్త హీరోతో జత కట్టింది. ఈ సినిమా తర్వాత తెలుగులో ఇప్పటి వరకు మెహరీన్ నుంచి కొత్తసినిమా ప్రకటనలు ఏవీ రాలేదు. కన్నడంలో ఒక సినిమా చేస్తోన్న అది కూడా ఇంకా స్టార్ట్ కాలేదు. చేతిలో సినిమాలు లేకపోవడంతో మెహరీన్ సోషల్ మీడియాలో తన ఫ్యాన్స్ కి టచ్ లో ఉంటుంది. ఇన్ స్టాగ్రామ్ లో యాక్టివ్ గా ఉంటుంది. ఈ ఫ్రీ టైంలో హ్యాపీగా నచ్చిన దేశాలు ఈ అమ్మడు తిరిగేస్తోంది. తాజాగా థాయ్ లాండ్ లో గ్రీన్ ఎలిఫెంట్ అభయారణ్యం పార్క్ లో ఏనుగుతో కలిగి దిగిన ఫోటో, వీడియోని మెహరీన్ ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది.

ఈ ఫోటో ఇప్పుడు వైరల్ అవుతోంది. బ్లాక్ కలర్ స్కర్ట్స్ లో చాలా స్లిమ్ గా క్రేజీ లుక్స్ తో ఈ అమ్మడు కట్టిపడేస్తోంది. ఈ ఫోటోలు చూస్తుంటే నేచర్ ని ఈ అమ్మడు బాగా ఆశ్వాదిస్తోన్నట్లు కనిపిస్తోంది. అయితే మెహరీన్ ని మరల వెండితెరపై చూడాలని ఆమె ఫ్యాన్స్ బలంగా కోరుకుంటున్నారు. మరి 2025లో అయిన కొత్త సినిమా స్టార్ట్ చేస్తుందా లేదా అనేది వేచి చూడాలి.

## బాలీవుడ్ 'థమా'లో పుష్ప 'గర్ల్‌ఫ్రెండ్' జాయిన్


పుష్ప 2 సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ రష్మిక మందన్న త్వరలో గర్ల్ ఫ్రెండ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. పుష్ప 2 లో రష్మిక మందన్న నటనకు జాతీయ అవార్డు రావాల్సిందే అంటూ ఆమె అభిమానులు నమ్మకంగా ఉన్నారు. అల్లు అర్జున్‌కి ఏమాత్రం తగ్గకుండా మంచి నటనతో మెప్పించింది. బాక్సాఫీస్ వద్ద మరో భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం కోసం ఎదురు చూస్తున్న రష్మిక మందన్న గర్ల్ ఫ్రెండ్ సినిమాతో పాటు మరికొన్ని సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. గత ఏడాది డిసెంబర్‌లో వచ్చిన యానిమల్ సినిమా తర్వాత రష్మిక బాలీవుడ్‌లో బిజీ అవుతోంది. ఇప్పటికే విక్కీ కౌశల్ నటించిన ఛావా సినిమాతో హిందీ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అయ్యింది. డిసెంబర్‌లోనే ఛావా సినిమా రావాల్సి ఉన్నా పుష్ప 2 విడుదల ఉండటంతో పాటు వీఎఫ్ఎక్స్ వర్క్ పూర్తి కానందున వాయిదా వేసిన విషయం తెల్సిందే. త్వరలోనే ఆ సినిమాను బాలీవుడ్ ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు




జరుగుతున్నాయి. భారీ అంచనాలున్న ఛావా సినిమాతో పాటు తాజాగా మరో పెద్ద హిందీ సినిమాలో రష్మిక మందన్న నటిస్తోంది. ఆయుష్మాన్ ఖురానా హీరోగా రూపొందుతున్న హర్రర్ కామెడీ మూవీ థమాలో రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తోంది. గతంలోనే ఈ సినిమా షూటింగ్ కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. ఆయుష్మాన్ ఖురానా సినిమా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఇప్పుడు రష్మిక షూటింగ్‌లో జాయిన్ అయ్యింది. ఈమధ్య కాలంలో హర్రర్ కామెడీ సినిమాలకు మంచి స్పందన లభిస్తోంది. భూల్ భులయ్యాతో పాటు స్త్రీ 2 సినిమాలు భారీ విజయాలను సొంతం చేసుకున్నాయి. అందుకే ఈ సినిమా సైతం భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుంది అనే నమ్మకంను మేకర్స్ వ్యక్తం చేస్తున్నారు. పుష్ప 2 సినిమాకి రష్మిక మందన్న ఏకంగా రూ. 10 కోట్ల పారితోషికంను అందుకుంది అనే విషయం తెల్సిందే. మూడు సంవత్సరాల పాటు పుష్ప కోసం కష్ట పడినట్లు చెప్పుకొచ్చింది. పుష్ప 2 విజయంతో భారీ ఎత్తున తన పారితోషికంను రష్మిక పెంచిందనే వార్తలు వస్తున్నాయి. అయినా ఆమెతో సినిమాలకు ప్రముఖ హీరోలు, నిర్మాతలు ఆసక్తి చూపిస్తున్నారు. అందుకు తగ్గట్లుగా ఆమె సినిమాల ఎంపిక ఉంటుంది. భారీ ఎత్తున అంచనాలున్న గర్ల్ ఫ్రెండ్ సినిమాతో పాటు వచ్చే ఏడాదిలో రష్మిక నటించిన మరో రెండు మూడు సినిమాలు విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఏడాదిలో రష్మిక జోరు ఏ స్థాయిలో ఉంటుందో చూడాలి.

## పంజాబీ బ్యూటీ డబుల్ ధమాకా!

పంజాబీ బ్యూటీ సోనమ్ బజ్వా టాలీవుడ్ కు సుపరిచితమే. బాబు బంగారంలో ఐటం పాటతో ప్రేక్షకుల్ని అలరించింది. అటుపై ఆటాడుకుందారా, బోర్న్ టూ బి కింగ్ లాంటి చిత్రాల్లో నటించింది. ఆ తర్వాత మళ్లీ తెలుగు సినిమాలు చేయలేదు. ఎక్కువగా పంజాబీ చిత్రాల్లోనే నటించింది. తమిళ్, హిందీలో కొన్ని సినిమాలు చేసింది. అయితే సొంత భాషలో సక్సెస్ అయినంతగా ఇతర భాషల్లో సక్సెస్ అవ్వలేదు. దీంతో సోనమ్ బజ్వా అంతగా ఫేమస్ కాలేపోయింది. అయితే అమ్మడికిప్పుడా ఛాన్స్ ముందుంది. బాలీవుడ్ హిట్ ఫ్రాంచైజీ హౌస్ ఫుల్ నటించే అవకాశం దక్కించు కుంది. హౌస్ ఫుల్ 5లో నటించే అవకాశం వచ్చింది. అలాగే మరో హిట్ ఫ్రాంచైజీ భాఘీలోనూ ఛాన్స్ అందుకుంది. బాఘీ-4లో చాన్స్ వచ్చింది. ఈ రెండు చిత్రాల్ని నిర్మించేది సాజిద్ నడియావాలా. ఆయనే సోనమ్ బజ్వాకి తన నిర్మాణ



సంస్థలో ఈ అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. ఓ రకంగా చెప్పాలంటే ఈ రెండు సినిమాలు కూడా అమ్మడికి డెబ్యూలు అనే అనాలి. బాల అనే హిందీ చిత్రంలో నటించినప్పటికీ అందులో అమ్మడి పాత్ర కూడా చిన్నది. సినిమా పెద్ద హిట్ అయినా సోనమ్ బజ్వాని గుర్తు పట్టడం కష్టమే అన్నట్లుగా ఉంటుంది. అందులో హీరోయిన్ గా భూమీ పడ్నే కర్ నటించింది. ఆయుష్మాన్ ఖురానా హీరోగా నటించగా, యామీ గౌతమ్ మరో హీరోయిన్ గా నటించింది. వీళ్లందరి మధ్యలో సోనమ్ బజ్వా పాత్ర హైలైట్ కాలేదు. అయితే తాజా అవకాశం ఆస్యమైనా బాఘీ, హౌస్ ఫుల్ లాంటి ఫ్రాంచైజీలతో కంబ్యాక్ అవ్వడంతో? అమ్మడు బాగా వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ సినిమాలు సక్సెస్ అయితే మరిన్ని కొత్త అవకాశాలకు ఆస్కారం ఉంది.




అల్లు అర్జున్ థియేటర్‌కు వచ్చి ఎలాంటి హంగామా చేయకుండా సినిమా చూసి వెళ్లిపోయి ఉంటే.. ఇంత గొడవ అయ్యేది కాదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 'ఆజ్‌తక్' నిర్వహించిన చర్చా వేదికలో పాల్గొన్న ఆయన.. అల్లు అర్జున్ అరెస్టు ఘటనపై మాట్లాడారు. "ఈ దేశంలో సల్మాన్‌ఖాన్, సంజయ్‌దత్‌లు ఎందుకు అరెస్టు అయ్యారు. ఒక సాధారణ పౌరుడి దగ్గరి నుంచి ప్రధాని వరకూ.. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అందరికీ సమానంగా వర్తిస్తుంది. 'పుష్ప2' విడుదల సందర్భంగా బెనిఫిట్ షోకే కాకుండా టికెట్ ధరలు పెంచుకోవడానికీ మేమే అనుమతి ఇచ్చాం. అయితే, ఆ షోకు ముందస్తు అనుమతి లేకుండా అల్లు అర్జున్ అక్కడకు వచ్చారు. ఆయన్ను చూసేందుకు అభిమానులు పోటెత్తారు. ఈ తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందింది. ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేసి, థియేటర్, మేనేజ్‌మెంట్ వాళ్లను అరెస్ట్ చేశారు. 10 రోజుల తర్వాత అల్లు అర్జున్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆయనకు బెయిల్ కూడా మంజూరు చేసింది. కావాలని సినిమా నటుడిని అరెస్టు చేశారని చర్చ మొదలు పెట్టారు. అతడు సినిమా స్టారా? పొలిటికల్ స్టారా? అన్న విషయాన్ని మా ప్రభుత్వం చూడదు. నేరం ఎవరు చేశారన్న దాన్నే చూస్తాం" "అక్కడ అల్లు అర్జున్ థియేటర్‌కు వచ్చి.. సినిమా మాత్రమే చూడలేదు. కారులో నుంచి బయటకు వచ్చి చేతులు ఊపుతూ ర్యాలీలా అభివాదం చేస్తూ వెళ్లారు. ఆయన ఎలాంటి హంగామా లేకుండా వచ్చి సినిమా చూసి ఉంటే ఈ గొడవ అయ్యేదే కాదు. అయినా కూడా జరిగిన ఘటనకు సంబంధించి ఏ11 కింద ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన కారణంగా ఒక మహిళ చనిపోయింది. దీనికి బాధ్యులు ఎవరు? 9 ఏళ్ల పిల్లాడు చావు బతుకుల మధ్య ఉన్నాడు. అందుకు ఎవరు బాధ్యత వహిస్తారు? ఆయన సినిమా చూడాలనుకుంటే స్టూడియోలో స్పెషల్ షో వేసుకుని చూడొచ్చు. ఇంట్లో కూర్చొని కూడా చూడొచ్చు. మీరు ప్రేక్షకులు, అభిమానులతో కలిసి చూడాలనుకుంటే, ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
లేదంటే, మేనేజ్‌మెంట్‌కు సమాచారం ఇస్తే, వాళ్లు ఏర్పాట్లు చూసుకుంటారు. అలా కాకుండా సడెన్‌గా వచ్చేస్తే, ఉన్న కొద్దిమంది సిబ్బందితో వాళ్లు ఎలా సిద్ధం కాగలరు" "అల్లు అర్జున్ చిన్నప్పట్నుంచి నాకు తెలుసు. కావాలని ఆయన్ను ఎందుకు అరెస్ట్ చేస్తాం? అల్లు అర్జున్ మేనమామ చిరంజీవి కాంగ్రెస్ నేత. ఆయన సొంతమామ చంద్రశేఖర్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌లోనే ఉన్నారు. అల్లు అర్జున్ సతీమణి కుటుంబం మాకు బంధువులవుతారు. పోలీసులు చేయాల్సిన పని వాళ్లు చేస్తారు. లా అండ్ ఆర్డర్ ప్రకారం నడుచుకుంటారు. అల్లు అర్జున్ అరెస్టయితే, ఇంత చర్చిస్తున్నారు కదా! ఆ ఘటనలో చనిపోయిన మహిళ కుటుంబం ఎలా ఉంది? వాళ్ల పరిస్థితి ఏంటి? తీవ్రంగా గాయపడిన ఆ పిల్లాడు ఎలా ఉన్నాడు? అతడు కోలుకోవడానికి ఎంత సమయం పడుతుంది? ఆ తర్వాత ఎలా బతుకుతాడు? అన్న విషయాలను ఒక్కరు కూడా అడగలేదు. అల్లు అర్జున్ ఫిల్మ్ స్టార్. సినిమాలు చేయడం ఆయన వ్యాపారం. డబ్బులు పెడతారు.. సంపాదిస్తారు. మీకు ఏమొస్తుంది? నాకేమొస్తుంది? రియల్ ఎస్టేట్ చేసే వ్యక్తులు ఉన్నారు. ప్లాట్‌లు అమ్ముతారు.. డబ్బులు సంపాదిస్తారు. ఈ దేశం కోసం భారత్-పాకిస్థాన్ బోర్డర్‌కు వెళ్లి ఏమైనా యుద్ధం చేశారా? మూవీ తీస్తున్నారు. డబ్బులు వస్తున్నాయి. నా ఫేవరెట్ నటుడు కృష్ణ. ఆయన ఇప్పుడు లేరు. నాకు నేనే పెద్ద స్టార్‌ని. నాకంటూ అభిమానులు ఉండాలి కానీ, నేనెవరికీ అభిమానిని కాదు." అని రేవంత్‌రెడ్డి చెప్పారు.




హైదరాబాద్: చంచల్‌గూడ జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తనకు అండగా నిలిచిన అభిమానులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. "నేను చట్టాన్ని గౌరవించే పౌరుణ్ని. చట్టానికి కట్టుబడి ఉంటాను. బాధిత కుటుంబానికి మరోసారి సానుభూతి తెలుపుతున్నా. నేను సినిమా చూసేందుకు వెళ్లినప్పుడు అనుకోకుండా ఘటన జరిగింది. ఉద్దేశపూర్వకంగా జరిగింది కాదు. 20 ఏళ్లుగా థియేటర్‌కు వెళ్లి సినిమా చూస్తున్నా. నా సినిమాలే కాదు.. మావయ్య సినిమాలూ చూశా. బాధిత కుటుంబానికి జరిగిన నష్టం పూడ్చలేనిది. అభిమానం, ప్రేమతో అండగా నిల్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. నేను బాగున్నాను.. ఎవరూ ఆందోళన చెందవద్దు" అని అల్లు అర్జున్ పేర్కొన్నారు.

**భావోద్వేగానికి గురైన అల్లు అర్జున్...** తన నివాసానికి చేరుకున్న అల్లు అర్జున్‌కు కుటుంబసభ్యులు దిష్టి తీసి స్వాగతం పలికారు. తన కుమారుడు, కుమార్తెను ఎత్తుకొని అల్లు అర్జున్ భావోద్వేగానికి గురయ్యారు. సతీమణి స్నేహ ఆయనను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని కన్నీటిపర్యంతమయ్యారు.

**న్యాయవాదులతో చర్చలు..** జైలు నుంచి విడుదలైన వెంటనే అల్లు అర్జున్ గీతా ఆర్ట్స్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ న్యాయవాదుల బృందం ఆయనతో చర్చలు జరిపింది. 45 నిమిషాల పాటు న్యాయవాది నిరంజన్‌రెడ్డితో అల్లు అర్జున్ చర్చించారు. బెయిల్ వచ్చినా విడుదల ఆలస్యంపై చర్చించినట్లు తెలుస్తోంది. ఆ తరువాత కార్యాలయం నుంచి అల్లు అర్జున్ తన నివాసానికి వచ్చారు.




యాదాద్రి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులోని మల్లికార్జున కాటన్ మిల్లులో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. భారీగా పత్తి దగ్ధమైంది. మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడుతుండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారమందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ ప్రమాదంలో సుమారు మూడు వేల క్వింటాళ్ల పత్తి దగ్ధమైనట్లు తెలుస్తోంది. ఆస్తినష్టం రూ.2 కోట్లపైనే జరిగినట్లు సమాచారం. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్లు అధికారులు గుర్తించారు.

## ఇబ్బందులు రాకుండా ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ చేపడతాం: సీఎం రేవంత్



హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ అనుకూలమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన గ్లోబల్ మాదిగ డే-2024 కార్యక్రమానికి సీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల డిక్లరేషన్ ద్వారా ఎస్సీ వర్గీకరణపై పార్టీ వైఖరిని ఖర్గే వెల్లడించారని సీఎం గుర్తు చేశారు. "ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పులో మా ప్రభుత్వం కీలకపాత్ర పోషించింది. వారం రోజుల్లో ఎస్సీ వర్గీకరణపై షమీమ్ అక్తర్ కమిషన్ నివేదిక వచ్చే అవకాశముంది. ఇబ్బందులు రాకుండా వర్గీకరణ ప్రక్రియ చేపడతాం. రాజకీయ, అధికార నియామకాల్లో మాదిగలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. చరిత్రలో తొలిసారి ఓయూ వీసీగా మాదిగ వర్గానికి చెందిన వ్యక్తిని నియమించాం" అని సీఎం వివరించారు.

## అల్లు అర్జున్ మామ మా పార్టీకి చెందిన నాయకుడే: మహేశ్‌కుమార్ గౌడ్




హైదరాబాద్: నటుడు అల్లు అర్జున్ అరెస్టు వ్యవహారంపై తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అల్లు అర్జున్ మామ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడేనని తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమేనని వ్యాఖ్యానించారు. "సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో మహిళ ప్రాణాలు కోల్పోయింది. ఆమె కుమారుడు చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నాడు.

తెలుగు చిత్రసీమకి.. కాంగ్రెస్‌కు విడదీయరాని బంధం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం కృషి వల్లే తెలుగు చిత్రపరిశ్రమ హైదరాబాద్‌కు వచ్చింది. స్టూడియోల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వమే భూములిచ్చింది. పదేళ్లలో తెలంగాణ తల్లి విగ్రహంపై భారాసకు ధ్యాస ఎందుకు లేదు? ఈ-రేసింగ్‌లో స్కామ్ జరిగినట్టు అధికారులు గుర్తించారు. అందులో కేటీఆర్ అక్రమాలు చేసినట్టు తేలితే చర్యలు తప్పవు" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

## భారాస గురుకుల బాటతో రాష్ట్ర ప్రభుత్వంలో చలనం: కేటీఆర్



హైదరాబాద్: భారాస చేపట్టిన గురుకుల బాటతో ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వంలో చలనం వచ్చిందని భారాస కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ప్రస్తుతం సంక్షేమ పాఠశాలలను సంక్షోభంగా మార్చి భయాందోళనకు గురి చేశారని విమర్శించారు. భారాస పాలనలో విద్యార్థులు ఎవరెస్టు వంటి శిఖరాలు అధిరోహించారన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో విద్యార్థులను ఆసుపత్రి మెట్లు ఎక్కించారని ఎద్దేవా చేశారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని డిమాండ్ చేశారు. "కాంగ్రెస్ పాలనలో సామాన్య విద్యార్థులు, తల్లిదండ్రుల్లో భయాందోళనలు కలిగాయి. పాఠాలు చెప్పే చోట పాము కాట్లతో పసిబిడ్డల ప్రాణాలు పోయాయి. దొంగలు పడ్డ ఆరు నెలలకు అన్నట్టు ఇప్పుడు గురుకులాల బాటపట్టారు. గురుకులాల మొక్కుబడి సందర్శన కాదు.. ఆ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టండి. ఫొటోలకు పోజులు ఇవ్వడం కాదు.. పట్టెడు పనికొచ్చే బువ్వ పెట్టి పొట్టలు నింపండి. కెమెరాల ముందు హంగామా చేయడం కాదు.. గురుకుల బిడ్డల గుండెచప్పుడు వినండి. మంది మార్బలంతో దండయాత్ర చేయకండి.. సమస్యలను తీర్చే ప్రయత్నం చేయండి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## 'ఎక్స్'లో స్పందించేవారు.. గతంలో ఎందుకని గురుకులాల్లో తిరగలేదు?: మంత్రి పొన్నం



హైదరాబాద్: గడచిన పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన పార్టీ నాయకులకు కనీస చిత్తశుద్ధి లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. గురుకులాలపై అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. షేక్‌పేట్‌లోని గురుకుల పాఠశాలను సందర్శించిన మంత్రి.. కలెక్టర్ అనుదీప్‌తో కలిసి కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. తెలంగాణ అన్ని రకాలుగా అభివృద్ధి చెందడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అందులో భాగంగానే విద్యార్థులకు మెరుగైన విద్య, ఆహారం అందించే దిశగా ముందుకెళ్తున్నట్లు చెప్పారు. డైట్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచామని.. దానివల్ల రాష్ట్రంలో 8 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరిందన్నారు. 'ఎక్స్' వేదికగా స్పందించే వారు.. గతంలో గురుకులాల్లో ఎందుకు తిరగలేకపోయారని పొన్నం ప్రశ్నించారు. విద్యార్థులందరూ కష్టపడి తమ కుటుంబానికి, తమ గ్రామాలకు పేరు తేవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి భోజనం చేశారు. వారికి ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.



## తెలంగాణ సంస్కృతిపై దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలి: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్: తెలంగాణ సంస్కృతిపై జరుగుతున్న దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందని భారాస ఎమ్మెల్సీ కవిత అన్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీలు, కవులు, కళాకారులు, ఉద్యమకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ తల్లిపై ప్రేమ లేదు కాబట్టే విగ్రహం రూపాన్ని మార్చారని ఆరోపించారు. తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మ లేకపోతే తెలంగాణ సమాజంలో స్నేహశీలత, సుహృద్భావం ఎలా కనిపిస్తుందని ప్రశ్నించారు. ఉద్యమ సమయం నుంచి ఉన్న తెలంగాణ తల్లినే ఆరాధిస్తానని కవిత స్పష్టం చేశారు. ఒక చేతిలో జొన్నకర్ర, మరో చేతిలో బతుకమ్మ ధరించిన తెలంగాణ తల్లి వైభవాన్ని చాటేలా పద్యాలు, కవితలు రచించి పుస్తకాలు విడుదల చేస్తామని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహాలను గ్రామ గ్రామానా ప్రతిష్ఠించే కార్యక్రమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు.

బతుకమ్మ అగ్రవర్ణాల పండుగ అన్న వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని తెలంగాణ జాతికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి రూపొందించిన విగ్రహానికి కాంగ్రెస్ మాతగా నామకరణం చేస్తూ తీర్మానం చేశారు.

## నేనే తీసుకెళ్లా.. మంచు మనోజ్ సంచలన వ్యాఖ్యలు





మంచు ఫ్యామిలీ కాంట్రవర్సీ రోజుకో కొత్త టర్న్ తీసుకుంటోంది. ఒక మీడియా సంస్థ జర్నలిస్ట్‌పై మోహన్ బాబు దాడి చేయడం వివాదాస్పదంగా మారింది. ఈ ఘటనలో ఆ జర్నలిస్ట్ తీవ్రంగా గాయపడటంతో మోహన్ బాబు సారీ చెప్పాలంటూ జర్నలిస్ట్ సంఘాలు ధర్నాకు దిగాయి. ఇప్పటికే ఈ ఘటనకు సంబంధించి మోహన్ బాబు క్షమాపణలు చెప్పారు. తాజాగా ఈ కాంట్రవర్సీ మీద మంచు మనోజ్ రియాక్ట్ అయ్యారు. తానే తీసుకెళ్లానంటూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

**నేనే తీసుకెళ్లా...** జర్నలిస్ట్‌పై దాడి ఘటనలో మీడియా తప్పేమీ లేదన్నారు మంచు మనోజ్. తానే వారిని లోపలకు తీసుకెళ్లానని స్పష్టం చేశారు. 'ఈ ఘటనలో మీడియా తప్పేమీ లేదు. నిస్సహాయ స్థితిలో నేనే జర్నలిస్టులను లోపలకు తీసుకొని వెళ్లా. మా ఇంట్లోకి నన్ను రానివ్వకపోవడంతోనే మీడియా ప్రతినిధులను వెంటబెట్టుకొని వెళ్లా. లోపలికి వెళ్లిన తర్వాత జర్నలిస్ట్ మీద దాడి జరిగింది. ఇందులో మీడియా తప్పు లేదు' అని మంచు మనోజ్ చెప్పుకొచ్చారు.

**షూటింగ్‌కు హాజరు...** కుటుంబ గొడవలతో సతమతమవుతున్న తరుణంలో మనోజ్ ఒక మూవీ షూటింగ్‌లో పాల్గొనడం ఆసక్తికరంగా మారింది. 'భైరవం' అనే సినిమా చిత్రీకరణకు ఆయన హాజరయ్యారని సమాచారం. ఇందులో మనోజ్‌తో పాటు బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నారా రోహిత్ ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు. దివ్య పిళ్లై, ఆనంది, అదితి శంకర్ హీరోయిన్లుగా యాక్ట్ చేస్తున్నారు. ఈ ఫిల్మ్‌కు విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్నారు.

## సంక్షేమ పథకాల అమలుపై మంత్రి పొంగులేటి షాకింగ్ కామెంట్స్



ఖమ్మం : కేసీఆర్ పాలనలో హాస్టళ్లలో దుర్భర దయనీయ పరిస్థితులు ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. పిల్లలను పాత కోళ్ల ఫారం షెడ్లలో పాడుపడిన భవనాల్లో ఉంచారని అన్నారు. సరైన భోజనం పెట్టలేదు దయనీయ స్థితిలో పేద పిల్లలు అవస్థలు పడ్డారని అన్నారు. ఈ పరిస్థితి చూసి చలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నారని అన్నారు. సకల సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో కొన్ని అమలు చేయలేకపోయామని ఇది వాస్తవమని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ ఆర్థిక దోపిడీ కారణంగా సంక్షేమ పథకాలు అమలుకు కాస్త ఆలస్యమైందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకి మిత్తి కట్టడానికే తెలంగాణ ఆర్థిక వనరులు సరిపోవటం లేదని అన్నారు. తప్పని సరిగా ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆర్థిక సమస్యలు ఉన్న మాట వాస్తవమని చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల అధిగమించి పేదల ప్రభుత్వంలో పేదల సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

## ప్రభుత్వ హాస్టళ్ల దుస్థితికి బీఆర్ఎస్సే కారణం: భట్టి విక్రమార్క..

ఖమ్మం: తెలంగాణ ప్రభుత్వ హాస్టళ్ల పెండింగ్ మెస్ ఛార్జీలన్నీ మంజూరు చేసినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి కొన్ని నెలల మెస్ ఛార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని భట్టి చెప్పారు. ప్రస్తుతం అన్నీ బిల్లులను మంజూరు చేసినట్లు వెల్లడించారు. పిల్లల ఆహారంలో ఎక్కడా కల్తీ ఉండకూడదని, నాణ్యత లోపించినట్లు ఎక్కడ కనిపించినా కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. పొరపాటున తేడా వచ్చినా సహించేది లేదని, ఉపేక్షించే ప్రసక్తే లేదని డిప్యూటీ సీఎం చెప్పారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా బోనకల్‌లోని ప్రభుత్వ హాస్టల్‌ను భట్టి విక్రమార్క సందర్శించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. " గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాఠశాలలు, హాస్టళ్ల మెనూ ఛార్జీలను పట్టించుకోలేదు. అదే పెద్దలు నేడు పాఠశాలలు సందర్శించి భోజనం బాగోలేదంటూ ఆరోపణలు చేస్తున్నారు. వారికి కనీసం సిగ్గు అనిపించడం లేదు. పాఠశాలలు, హాస్టళ్లు ఈ విధంగా కావడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం కారణం కాదా?. మీ లాగా కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు చేయడం లేదు. బాధ్యతగా అంకిత భావంతో పని చేస్తున్నాం. మేము మాటలు చెప్పడం కాదు, చేతల్లో చేసి చూపిస్తాం. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ కోసం పాటుపడుతున్నాం. అందుకే అన్నీ ప్రభుత్వ హాస్టళ్లలో పిల్లలకు బలమైన ఆహారం అందించేందుకు నిర్ణయించాం. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ఒకే రకమైన డైట్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ మేరకు బలమైన ఆహారం అందించేందుకు వైద్య నిపుణులతో డైట్ ప్లాన్ చేశాం. 40 శాతం మేర డైట్ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నాం. 8వ తరగతి వారికి రూ.1,540, ఇంటర్, పీజీ వారికి రూ.2,100కు పెంచాం. విద్యార్థుల కాస్మొటిక్ ఛార్జీలను సైతం 200 శాతం పెంచాం. ఏడో తరగతి వారికి రూ.175లు, 8వ తరగతి, ఆపై చదివే వారికి రూ.75 నుంచి రూ.275కు పెంచాం. చివరికి హెయిర్ కటింగ్ ఛార్జీలూ పెంచాం. రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడినప్పటికీ పెంచుతున్నాం. రెసిడెన్షియల్ పాఠశాలలకే కాదు, మాములు హాస్టళ్లకూ పెంచాం. అన్నీ గురుకులాలు, హాస్టళ్లకు శాశ్వత భవనాల నిర్మాణం చేస్తున్నాం. ప్రపంచంతో పోటీ పడే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను రూ.5 వేల కోట్లతో నిర్మిస్తున్నాం. గత ప్రభుత్వం వసతి గృహాల నిర్మాణాలకు రూ.70 కోట్లు ఖర్చు చేసింది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com